రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్



Bhavani Publication Trust
APTEL/2001/5268
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 357 | హైదరాబాద్ | మంగళవారం 10 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR







జాతి అస్తిత్వానికి ప్రతీకగా విగ్రహ రూపకల్పన

మేధావులు, ఉద్యమకారుల అభిప్రాయం మేరకే

గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

టీజీని పునరుద్ధరించి.. రాష్ట్ర గీతాన్ని ప్రకటించాం

9మంది ఉద్యమకారులకు

రూ.కోటి, 300 గజాలు

అసెంబ్లీ, విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

రాష్ట్ర వేడుకగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం

మండల స్థాయి వరకు 'డిసెంబరు 9' పండుగ

ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహణకు ఆదేశాలు

తెలంగాణ తల్లి రూపాన్ని ఆమోదిస్తూ ఉత్తర్వులు

మాటలు, చేతలతో అగౌరవ పరచడం నేరం

# అమ్మ రూపమే

**తెలంగాణ తల్లి.. ఉద్యమ కాలం నుంచీ ఓ ఉద్వేగం! ఆ ఉద్వేగానికి ఇప్పుడు అధికారిక రూపం వచ్చింది! ప్రశాంత వదనంతో.. ఆకుపచ్చ చీరలో గ్రామీణ మహిళను పోలి ఉండే రూపంతో ఉన్న విగ్రహాన్ని సచివాలయం ఆవరణలో రేవంత్ సర్కారు ఏర్పాటు చేసింది! హుస్సేన్ సాగర్ తీరంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ తల్లిని బహుజనుల తల్లిగా అభివర్ణించారు. ప్రతి ఇంట్లోని తల్లికి ప్రతి రూపమే విగ్రహ రూపమని, దానిని మార్చినా.. ఏ రూపంలో అవమానించినా చట్టపరంగా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. తెలంగాణ తల్లిపై తొలుత అసెంబ్లీలోనూ ఆ తర్వాత సచివాలయ ప్రాంగణంలో జరిగిన సభలోనూ ఆయన మాట్లాడారు.**

**(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)**

తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ప్రతి ఇంట్లోని కన్నతల్లిని చూసిన భావన కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరికీ అమ్మను చూసిన భావన కలిగేలా విగ్రహాన్ని రూపొందించామని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం, అస్తిత్వం ఉట్టిపడేలా బహుజనుల తెలంగాణ తల్లిగా రూపొందించామన్నారు. విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయని, దేవతలా ఉండాలా? సొంత మాతృమూర్తిలా ఉండాలా? అన్న చర్చ జరిగిందని పేర్కొన్నారు. దేవత గుడిలో

- మిగతా 2వ పేజీలో

కాంగ్రెస్ అపచారానికి..

# తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలి..

కేటీఆర్ పిలుపు



**(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)**

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడిక్కడ తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు నిచ్చారు. మేడ్చల్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. 'ప్రభుత్వం చేసిన అపచారానికి తప్పకుండా రీతిలో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది. అందుకే ఈ వేదిక ద్వారా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులందరికీ.. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుడికి, ప్రతి ఒక్క ఉద్యమ బిడ్డకి నేను విజ్ఞప్తి చేస్తున్నా. మనం రెండు పనులు చేద్దాం. ఖచ్చితంగా తెలంగాణ తల్లిని 2007లో ఏ తల్లి అయితే ఉద్యమంలో నుంచి ఉద్భవించిందో.. సోషల్ మీడియా, వాట్సాప్ డీపీల్లో తెలంగాణ తల్లి డీపీగా పెట్టుకుందాం.. ఎవడు ఏం పీకుతడో చూద్దాం అనే మాట నేను విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ.. ఎక్కడైతే తెలంగాణ తల్లి విగ్రహాలు ఉన్నాయో.. అక్కడ రేపటి రోజున.. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా రేపు రాష్ట్ర వ్యాప్తంగా పాలాభిషేకాలు చేద్దాం. అవసరమైతే పంచామృతాభిషేకాలు చేద్దాం.. జరిగిన తప్పుకు క్షమాపణలు అడుగుదాం.. ఈ కాంగ్రెస్ మూరు?లకు చరిత్ర తెలియదు.. ఈ సన్నాసులను క్షమించమని కోరుదాం' అన్నారు.

### రేవంత్‌రెడ్డి దొంగ మాటలు..

'ఇంకా చెప్పాలంటే చాలా ఉన్నయ్. మచ్చుకు ఒకటి. సంవత్సరం పాలన.. విజయోత్సవాలు అని చెప్పి పైసలు బర్బాది చేస్తున్నది రేవంత్ ప్రభుత్వం. రుణమాఫీ అయిపోయింది చేశానని అంటున్నడు. మా ఇద్దరు నేతలు వచ్చి ఓ

- మిగతా 2వ పేజీలో

# ముగిసిన 'చెన్నమనేని' పౌరసత్వ వివాదం

జర్మన్ పౌరుడేనని
తేల్చిన హైకోర్టు
కోర్టును తప్పుదోవ
పట్టించారని ఆగ్రహం
రూ. 30 లక్షలు జరిమానా

-2లో





# ఆశా వర్కర్లపై పోలీస్ లాఠీచార్జి అమానుషం.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత..



గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అడిగినందుకు కాంగ్రెస్ పాలకులు ఆడబిడ్డలను ఖాకీలతో కొట్టించడం అమానుషం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలను

- మిగతా 2వ పేజీలో

# దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

విదేశీ శక్తుల 'సాధనం'గా కాంగ్రెస్..

సోరోస్ నిధులిస్తున్న సంస్థతో

సోనియాకు సంబంధాలు

బీజేపీ అధ్యక్షుడు నడ్డా ఆరోపణలు

తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే

రాజ్యసభలో ఇద్దరి మధ్య మాటల యుద్ధం

**(ప్రజాతీర్పు ప్రతినిధి, న్యూఢిల్లీ)**

పార్లమెంట్ సమావేశాల్లో అదానీ అంశంపై చర్చించాలని విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అధికార బీజేపీకి 'జార్జ్ సోరోస్' అస్త్రం దొరికింది. అమెరికన్-హంగేరియన్ వ్యాపారవేత్త జార్జ్ సోరోస్ ఫౌండేషన్ నిధులు సమకూరుస్తున్న సంస్థతో



కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. బీజేపీ ఆరోపణలపై సోమవారం రాజ్యసభలో

- మిగతా 2వ పేజీలో

# ఏపీ మంత్రి మండలిలోకి నాగబాబు..



**(ప్రజాతీర్పు ప్రతినిధి, అమరావతి)**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోనున్నారా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. వాస్తవానికి జనసేనలో నాగబాబు ఎన్నికల ముందునుంచి

- మిగతా 2వ పేజీలో



## జమిలీ ఎన్నికల బిల్లు ఈ పార్లమెంటు సమావేశాల్లోనే

3



## అన్నదాతల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

8



## హోటల్ గదుల్లో కూర్చోవడం కాదు.. రోహిత్, కోహ్లీలపై గవాస్కర్ ఘాటు వ్యాఖ్యలు



# అమ్మ రూపమే

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని, తల్లి ఇంట్లో ఉంటుందని, మనల్ని ఒడిలో పెట్టుకుని పెంచుతుందని గుర్తు చేశారు. పైగా అందుకే తల్లి రూపమే ఉండాలన్న అభిప్రాయాల మేరకు బహుజనుల తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని వెల్లడించారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభం కాగానే.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అనుమతితో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడారు. "తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన సందర్భంలో రెండు అంశాలు చర్చకు వచ్చాయి. విగ్రహం.. వజ్ర వైడూర్యాలు, కిరీటాలు, భుజకీర్తులతో దేవతలా ఉండాలా? లేక మనల్ని గుండెల్లో పెట్టుకుని చూసుకునే మన అమ్మలా ఉండాలా? అనే ప్రస్తావన వచ్చింది. మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులందరూ తెలంగాణ తల్లి విగ్రహం మన తల్లిలా ఉండాలని అభిప్రాయపడ్డారు. దేవత గుడిలో ఉంటుంది.. తల్లి మన ఇంట్లో ఉంటుంది. తల్లి ఒడిలోనే మనం పెరుగుతాం కాబట్టి.. తెలంగాణ తల్లి కావాలని చెప్పారు. తల్లి ప్రతిరూపాన్ని పెట్టుకోవాలని సూచించారు. ఆ మేరకే ప్రతి ఇంట్లో కన్న తల్లిని చూసినట్లుగా ఉండే విగ్రహాన్ని రూపొందించాం" అని సీఎం అన్నారు.

**మాతృమూర్తిలా రాష్ట్రాన్నిచ్చిన సోనియా**

ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడానికి ఈ తెలంగాణ సమాజం శక్తినంతా కూడదీసుకుని వీరోచితంగా పోరాటం చేసిందని సీఎం రేవంత్ అన్నారు. ఆ పోరాటాల్లో ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు ప్రత్యేక భూమికను పోషించాయన్నారు. "ఉన్నత విద్య కోసం, తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లోని పేదలు, అత్యంత నిరుపేదలైన బహుజనులు తమ పిల్లలను ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు పంపించారు. కానీ, ఆ విద్యార్థులు చదువొక్కటే కాదు.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి కూడా పోరాటం చేయాలని భావించారు. లక్షలాది మంది విద్యార్థులు తెలంగాణ పోరాట బాట పట్టారు. వారి స్ఫూరితోనే తొలి దశ, మలి దశ ఉద్యమాలు సాగాయి. వివిధ కారణాల వల్ల ప్రత్యే రాష్ట్ర ఆకాంక్ష వాయిదా పడుతూ వచ్చినప్పుడు... చివరి రక్తపు బొట్టు వరకు, ఆఖరి శ్వాస వరకు, సమిధలైనా పర్వా లేదంటూ ఆనాడు యువత ఉద్యమానికి ముందుకొచ్చింది. శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్‌రెడ్డి... ఇలా ఎంతో మంది విద్యార్థులు ఉద్యమకారులు, ఆకాశంలో తారాజువ్వలై, రాష్ట్రం కోసం అమరులయ్యారు. అలాంటి సందర్భంలో సోనియాగాంధీ.. ఒక మాతృమూర్తిగా, రాజకీయ ఆలోచనలను పక్కనపెట్టి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి, ప్రజల ఆకాంక్షను నెరవేర్చడానికి ఉదాత్తమైన నిర్ణయం తీసుకున్నారు. 2009 డిసెంబరు 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందంటూ ప్రకటన ఇప్పించారు. ఆ తర్వాత అవాంతరాలు ఎదురైనా, పార్టీపరంగా ఎన్నో కోల్పోయినప్పటికీ.. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చారు" అని రేవంత్ వివరించారు.

**పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు..**

"గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి ప్రతిరూపాన్ని సృష్టించడం వంటి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని సీఎం రేవంత్ ఆరోపించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అప్పటి కొత్త ప్రభుత్వం వెంటనే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉన్నా.. అది జరగలేదన్నారు. బండ్లపైనే కాకుండా.. గుండెలపైనా రాసుకున్న టీజీని పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీజీనీ పునరుద్ధరించామని ప్రకటించారు. "వేలాది మందిని ఉద్యమం వైపు నడిపిన జయ జయహే తెలంగాణ గీతాన్ని అప్పటి ప్రభుత్వం రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు. దాంతో పదేళ్లలో రాష్ట్ర గీతమనేదే లేకుండా పోయింది. కానీ ఒక గొప్ప స్ఫూర్తిని, పోరాట పటిమను చూపిన, ఉద్యమ బాట వైపు నడిపించిన గీతాన్ని రాష్ట్ర గీతంగా చేయాలని అనుకున్నాం. ఇప్పుడు ఏ కార్యక్రమం నిర్వహించినా... ఈ గీతాన్ని ఆలపిస్తున్నాం. గత పదేళ్లలో అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహంలేదు. అందుకే తెలంగాణ భావన, ఆలోచన, ఆత్మగౌరవం, అస్తిత్వం ఉట్టిపడేలా, కవులు, కళాకారులు, ఉద్యమ కారులతో చర్చించి తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించాం" అని సీఎం చెప్పారు.

## ఏపీ మంత్రి మండలిలోకి నాగబాబు.. టీడీపీ రాజ్యసభ సభ్యులు వీళ్లే..

(మొదటి పేజీ తరువాయి)

కీలకంగా పనిచేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో సోదరుడి ప్రచార బాధ్యతలను ఆయన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నాగబాబుకు మంచి పదవి లభిస్తుందని ప్రచారం జరిగింది. తొలుత టీటీడీ ఛైర్మన్ పదవి ఇస్తారని ప్రచారం జరగ్గా.. టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడిని నియమించారు. ఆ తర్వాత ఏపీ నుంచి మూడు రాజ్యసభ సభ్యుల స్థానాలు ఖాళీ అవ్వడంతో తప్పనిసరిగా నాగబాబుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పిస్తారని చర్చ జరిగింది. పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో నాగబాబు రాజ్యసభ సభ్యత్వంపై స్పష్టత వచ్చిందని, బీజేపీ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. తీరా చూస్తే మూడు రాజ్యసభ స్థానాల్లో టీడీపీకి రెండు, బీజేపీకి ఒకటి వెళ్లాయి. దీంతో నాగబాబుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం దక్కలేదు. తాజాగా నాగబాబును ఎమ్మెల్సీ చేసి ఏపీ మంత్రి వర్గంలోకి తీసుకుంటారనే చర్చ జరుగుతోంది. త్వరలోనే నాగబాబు జనసేన నుంచి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, ఆయనకు కేబినెట్‌లో బెర్త్ కన్ఫర్మ్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. జనసేనను ఏపీలో బలపర్చేందుకు పవన్ కళ్యాణ్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఓవైపు కూటమిలో ఉంటూనే క్షేత్రస్థాయిలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పవన్ కళ్యాణ్‌కు నాగబాబు మొదటినుంచి తోడుగా ఉంటూ వచ్చారు. దీంతో ఆయనను రాజ్యసభకు పంపిస్తే ఎక్కువ ఢిల్లీలో ఉండాల్సి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో నాగబాబు రాష్ట్ర రాజకీయాల్లో ఉంటేనే బెటరనే ఆలోచన పవన్ కళ్యాణ్ ఉన్నట్లు తెలుస్తోంది. పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, నేరుగా ప్రజల్లోకి వెళ్లేందుకు భద్రతా పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, మంత్రి హోదాలో నాగబాబును పార్టీ శ్రేణులకు దగ్గర చేయాలనే ఆలోచనలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలోనే నాగబాబు మంత్రివర్గంలో చేరే అంశానికి సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# ముగిసిన 'చెన్నమనేని' పౌరసత్వ వివాదం

**జర్మన్ పౌరుడేనని తేల్చిన హైకోర్టు**
**కోర్టును తప్పుదోవ పట్టించారని ఆగ్రహం**
**రూ. 30 లక్షలు జరిమానా**

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని హైకోర్టు తీర్పు ఇచ్చింది. తప్పుడు పత్రాలతో కోర్టును తప్పుదోవ పట్టించినందుకు రమేశ్ కు రూ.30 లక్షల జరిమానా విధించింది. పౌరసత్వం కేసులో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో చెన్నమనేని రమేశ్‌బాబుకు రూ. 30 లక్షల జరిమానా విధించింది. రూ. 25 లక్షలు ప్రస్తుత ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు చెల్లించాలని, మరో రూ. 5 లక్షలు హైకోర్టు న్యాయసేవాధికార సంస్థకు చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది. నెలలోపు జరిమానా చెల్లించాలని స్పష్టం చేసింది. చెన్నమనేని జర్మనీ పౌరుడిగా ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచారని కోర్టు తీర్పు ఇచ్చింది. తప్పుడు పత్రాలతో గత 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించారని వ్యాఖ్యానించింది. తప్పుడు సమాచారంతో చెన్నమనేని రమేశ్ ఎన్నికల్లో పోటీ చేశారని కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న ఆది శ్రీనివాస్ గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రమేశ్ వేములవాడ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందారు. 2009లో తెలుగుదేశం పార్టీ నుంచి, ఆ తర్వాత ఉపఎన్నికతో కలిపి 2010





నుంచి 2018 వరకు మూడుసార్లు విజయం సాధించారు. చట్టం ప్రకారం భారతీయ పౌరులు కాని వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు లేదా ఓటు వేసేందుకు అవకాశం లేదు. మాజీ ఎమ్మెల్యే రమేశ్ జర్మన్ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉన్నారని, అది 2023 వరకు చెల్లుబాటులో ఉందని 2020లో కేంద్రం తెలంగాణ హైకోర్టుకు తెలియజేసింది. అయితే రమేశ్ తన దరఖాస్తులో వాస్తవాలను దాచిపెట్టిన కారణంగా భారతీయ పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. రమేశ్ తప్పుడు పత్రాలతో భారత ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ హైకోర్టుకు తెలిపింది. హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలను సవాల్ చేస్తూ రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జర్మన్ పాస్‌పోర్ట్ సరెండర్‌కు సంబంధించిన వివరాలను, జర్మన్ పౌరసత్వాన్ని వదులుకున్నట్లు రుజువు చేస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేయమని హైకోర్టు రమేశ్ ను ఆదేశించింది. ఈ కారణంతో 2013లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రమేశ్ ఉపఎన్నిక విజయాన్ని రద్దు చేసింది. దీంతో రమేశ్ సుప్రీం కోర్టును ఆశ్రయించి స్టే విధించింది. స్టే అమల్లో ఉండగానే 2014, 2018 ఎన్నికల్లో చెన్నమనేని ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు.

### న్యాయం గెలిచింది.



ఇన్నేళ్లుగా నేను చేసిన పోరాటం ఫలించింది. ఎట్టకేలకు న్యాయం గెలిచింది. నేను చేసిన న్యాయ పోరాటానికి సహకరించిన నా ప్రాంత ప్రజలకు ధన్యవాదాలు. కోర్టును తప్పుదోవ పట్టించినందుకు చెన్నమనేని రమేశ్ పై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతాను. నా సుదీర్ఘ న్యాయ పోరాటంలో నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు"

**– ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

## నిరాశ పరిచింది: చెన్నమనేని రమేష్‌బాబు

తన పౌరసత్వంపై సోమవారం తెలంగాణ వెలువరించిన తీర్పుపై వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు స్పందించారు. ఆయన మాటల్లోనే.. 'ఈ రోజు హైకోర్టులో నా పౌరసత్వం పైన వెలువడిన తీర్పు నన్ను తీవ్రంగా నిరాశపరిచింది. ఈ తీర్పు హేతుబద్ధంగా లేదన్న అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. ఇది ప్రధానంగా 2019 లోనే తెలంగాణా హైకోర్టు పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10.3ని తూచా తప్పకుండా అమలు చేయాలని కేంద్ర హోంశాఖ ను ఆదేశించిన నేపథ్యానికి వర్తిస్తుంది. రాజకీయ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు రావచ్చు, కానీ వాటన్నిటినీ స్వయంగా, మిత్రులు శ్రేయోభిలాషుల సహకారంతో తట్టుకొని ముందుకు పోవడం, ఆ ప్రస్థానంలో నీతి నిజాయితీగా పనిచేసి వరుసగా నాలుగు సార్లు ఎన్నికలలో పూర్తి ప్రజామోదం పొందడం నాకు లభించిన అరుదైన గొప్ప భాగ్యం. అయితే వరుస ఓటములు జీర్ణించుకోలేక అడ్డంకులు సృష్టించిన ఉదంతమే ప్రధానంగా నా పౌరసత్వంపై వేసిన కేసులు. వీటన్నిటినీ గతంలో రెండు సార్లు, హైకోర్టు సుప్రీంకోర్టుల్లో, విజయవంతంగా ఎదురుకోవడం జరిగింది, ప్రస్తుత తీర్పు పై కోర్టుకు వెళ్లే అవకాశాన్ని



న్యాయవాదులు పరిశీలిస్తున్నారు. గత ఎన్నికల తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నా, భవిష్యత్తులో కూడా మా ప్రాంతాభివృద్ధికి నా వంతు సహకారం తప్పక ఉంటుంది.' అని ఆయన అన్నారు.

# తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలి.. కేటీఆర్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

కాగితం ఇచ్చి వెళ్లారు. ఘట్కేసర్ ఫార్మర్స్ సర్వీస్ కో ఆపరేటివ్ సొసైటీ. మచ్చుకు ఎంత దొంగమాటలు.. రేవంత్‌రెడ్డి మాట్లాడే మాటలు.. కాంగ్రెస్ మాటలు అని చెప్పడానికి ఒకటి శాంపిల్‌గా ఒకటి చెబుతున్న. ఘట్కేర్ రైతుల కో ఆపరేటివ్ సొసైటీ.. ఇందులో 1189 మంది రైతులు ఉన్నరు. అందరికీ రూ.2లక్షల కంటే తక్కువనే లోన్లు ఉన్నయ్. మొత్తం చిట్టా ఉన్నది. వాళ్లకు కావాల్సిన రుణమాఫీ తిప్పితిప్పి కొడితే.. రూ.18.98లక్షలు. రేవంత్‌రెడ్డి మొత్తం అయ్యింది అంటున్నడు. ఇందులో ఎంత మందికి రుణమాఫీ జరిగిందో తెలుసా?.. 1189 మంది రైతుల్లో ఒకరికీ రుణమాఫీ కాలేదు. గిట్లుంటది రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌తో పెట్టుకుంటే. ఆరు గ్యారంటీలు అటకెక్కినయ్' అన్నారు.

**రేవంత్‌రెడ్డి ఏం చేశాడంటే.. అన్నాదమ్ముళ్లకు అమృతం పంచిండు..**

'ఈ సంవత్సర కాలంలో ఏంజరిగిందని ఆలోచిస్తే.. మూడు మాటలు చెప్పచ్చు. కేసీఆర్‌కు తిట్లు.. దేవుడిపై ఒట్లు.. హామీలకు మాత్రం తూట్లు. 420 హామీలకు తూట్లు. ఇది తప్పా పీకింది ఏమీ లేదు. రేవంత్‌రెడ్డి ఏం చేసిండయ్యా అంటే.. అదానీ కోసం, అల్లుడి కోసం.. అన్నదమ్ముళ్ల కోసం, బావమరిదికి అమృతం పంచేందుకు జోర్దార్ పని చేసిండు. వచ్చే సంవత్సరం అనుముల అన్నాదమ్ముళ్లు అదానీ దాటిపోయే స్థాయికి తెలంగాణ మాత్రం దోపిడీ చేస్తున్నరు. అందుకే మిమ్మల్ని కోరేదీ. సందర్భం ఏదైనా ఈ మోసగాళ్లను నమ్మడానికి వీల్లేదు. రాబోయే రోజుల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు కావచ్చు. జిల్లా పరిషత్ ఎన్నికలు కావొచ్చు.. మున్సిపల్ ఎన్నికలు కావొచ్చు.. ఆ తర్వాత వచ్చే శాసనసభ ఎన్నికలు కావొచ్చు. అప్రమత్తంగా ఉందాం.. పార్టీని పునర్మించుకుందాం.. వచ్చే సంవత్సరం దివ్యంగా సభ్యత్వం నుంచి అన్ని కార్యక్రమాలు చేసుకుందాం. ఒక వైపు ప్రజలకు అండగా ఉంటూ.. ప్రజా పోరాటాల్లో కీలకపాత్ర పోషిస్తూ.. మరో వైపు పార్టీని కూడా ముందుకు తీసుకెళ్దాం' అన్నారు. మేడ్చల్‌లో బ్రహ్మాండంగా కార్యక్రమం నిర్వహించిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజు, సహకరించిన కేపీ వివేక్, పెద్దలందరికీ నమస్కారాలు. జై తెలంగాణ! అంటూ ముగించారు.

## ఆశా వర్కర్లపై పోలీస్ లాఠీచార్జి అమానుషం..



(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మండి పడ్డారు. నెలకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని శాంతియుతంగా నిరసన తెలియజేసిన ఆశా వర్కర్లను దారుణంగా పోలీసులు కొట్టారని ఆరోపించారు. ఆశా వర్కర్లను బలవంతంగా పోలీస్ వ్యాన్లలో ఎక్కించిన తీరు.. ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో ఉన్న నిర్బంధాలు, అణచివేతకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇదేనా తెలంగాణ ఆడబిడ్డలకు సోనియా గాంధీ బర్త్ డే గిఫ్ట్ అని కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో, బతుకమ్మ ఆడే చేతులతోనే, ఆడబిడ్డలు కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటం ఖాయం అని స్పష్టం చేశారు.

# దేశాన్ని అస్థిరపర్చే కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

గందరగోళం నెలకొంది. కేంద్ర మంత్రి జేపీ నడ్డాబీ రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే మధ్య మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తుల చేతుల్లో 'సాధనం'గా వ్యవహరిస్తోందని నడ్డా ఆరోపించారు. సోరోసతో కాంగ్రెసకు సంబంధాలు ఉన్నాయని, భారత్‌ను అస్థిరపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై ఖర్గే తీవ్రంగా స్పందించారు. నడ్డా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. సమస్యల నుంచి ప్రజల నుంచి దృష్టి మరల్చేందుకే బీజేపీ నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో నడ్డా, ఖర్గేలను తన చాంబర్‌కు రావాలని ధన్‌ఖడ్ ఆదేశించారు. విపక్ష పార్టీల ఎంపీలు తాము లేవనెత్తిన అంశాలపై చర్చించాలని పట్టుబట్టడంతో సభ వాయిదాల పర్వంలో నడిచింది. రెండోసారి వాయిదా అనంతరం సభ తిరిగి ప్రారంభమైన తర్వాత నడ్డా మాట్లాడుతూ.. ఫోరమ్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్స్ ఇన్ ఆసియా ఫసిఫిక్ ఫౌండేషన్‌కు సోరోస్ సంస్థ నిధులు సమకూరుస్తోందన్నారు. ఆ ఫౌండేషన్‌కు సోనియా సహ అధ్యక్షురాలిగా ఉన్నారని చెప్పారు.ఇది చాలా తీవ్రమైన అంశమన్నారు. 'ఇది భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. జాతీయ భద్రతపై ఆందోళనను పెంచుతోంది. దేశ భద్రతతో కాంగ్రెస్ ఆటలు ఆడుకుంటోంది. అందుకే ఈ అంశంపై చర్చించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొన్నారు. దీంతో సోనియా, సోరోస్ సంస్థ సంబంధాలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. బీజేపీ సభ్యుల డిమాండ్‌పై కాంగ్రెస్ ఎంపీలు ఖర్గే, జైరాం రమేశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని లేవనెత్తేందుకు బీజేపీ ఎంపీలను ఎలా అనుమతించారని చైర్మన్‌ను అడిగారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడడం వారి ప్రతిష్ఠను దిగజార్చడమేనన్నారు. చైర్మన్ ధన్‌ఖడ్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు మాట్లాడుతూ.. సోనియా–సోరోస్ మధ్య సంబం?ధాలు దేశ భద్రతకు ఆందోళనకరమన్నారు. కాగా,సభలో చైర్మన్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ ఎంపీ జైరాంరమేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రమేశ్ ఆరోపించారు. గందరగోళ పరిస్థితులతో చైర్మన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**లోక్‌సభలోనూ గందరగోళం..**

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని, మణిపూర్ అంశం, శంభులో రైతులపై రబ్బర్ బుల్లెట్లతో దాడి వంటి అంశాలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష సభ్యుల నినాదాలతో సభ కొద్దిసేపటికే వాయిదా పడింది. మళ్లీ సభ ప్రారంభం కాగానే విపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మ ధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ తెలి పారు. మళ్లీ అదే పరిస్థితి ఉండడంతో 3 గంటలకు వాయిదా వేశారు. ఒకవైపు ప్రతిపక్షాల ఆందోళన జరుగుతుండగానే, మరోవైపు బీజేపీ ఎంపీలు సో నియా–సోరోస్ అంశంపై చర్చించాలని పట్టుబ ట్టారు. దీంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

**'ఒకే దేశం–ఒకే ఎన్నిక' బిల్లుపై జేపీసీ?**

పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎలక్షన్లు నిర్వహించే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానంపై ముందుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఏకాభిప్రాయ సాధన ద్వారానే ఈ బిల్లును ఆమోదింపజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు విస్తృతంగా చర్చలు జరిపేందుకు వీలుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని కూడా నియమించే అవకాశం ఉంది.

# జమిలీ ఎన్నికల బిల్లు ఈ పార్లమెంటు సమావేశాల్లోనే

ఒకే దేశం-ఒకే ఎన్నికల విధానాన్ని అమలు చేసే దిశగా మరో ముందడుగు పడనుంది. పార్లమెంటు నుంచి ఎన్నికల వరకూ ఒకేసారి అన్ని ఎన్నికలను నిర్వహించే 'జమిలి' ఎన్నికల బిల్లును ప్రస్తుత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాల సమాచారం. ఒకే దేశం-ఒకే ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ నివేదికను కేంద్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదించింది. దీనిపై ఏకాభిప్రాయం సాధించి, విస్తృత సంప్రదింపుల కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ పంపాలని కేంద్రం యోచిస్తున్నట్టు చెబుతున్నారు. జేపీసీ ఏర్పాటు ద్వారా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపడం, సంబంధిత భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఆలోచనగా తెలుస్తోంది. కాగా, ఏకాభిప్రాయం లేకుండా ప్రస్తుతం ఉన్న ఎన్నికల వ్యవస్థలో మార్పులు చేయడం పెనుసవాలే అవుతుంది. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ప్లాన్ అమలు చేయాలంటే పలు రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందని రామ్‌నాథ్ కోవిడ్ కమిటీ సైతం సిఫారసు చేసింది. ఇందుకు ప్రభుత్వానికి పార్లమెంటులో (ఉభయసభల్లో) మూడింట రెండువంతుల మెజారిటీ అవసరమవుతుంది. ఉభయ సభల్లో ఎన్డీయేకు సాధారణ మెజారిటీ మాత్రమే ఉన్నందున మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడమనేది కష్టమైన పనే అవుతుంది.



**ఉభయసభల్లో మెజారిటీ ఎంత?**

రాజ్యసభలోని 245 స్థానాలకు ఎన్డీయేకు 112 మంది సభ్యుల బలం ఉండగా, విపక్ష పార్టీలకు 85 మంది సభ్యుల బలం ఉంది. మూడింట రెండువంతుల మెజారిటీ అంటే కనీసం 164 ఓట్లు కావాలి. లోక్‌సభలో మొత్తం 545 స్థానాల్లో ఎన్డీయేకు 292 స్థానాలు న్నాయి. ముడింట రెండువంతుల మెజా రిటీకి 364 ఓట్లు అవసరం. అయితే, ఓటింగ్‌కు హాజరైన సభ్యుల సంఖ్య ఆధారంగా మెజా రిటీ లెక్కలు మార తాయి.

**ఎవరి వాదన ఎలా ఉంది?**

ఏకకాలంలో ఎన్నికలు (జమిలీ) జరపడం వల్ల సమయం, ఖర్చు వంటివి ఆదా అవుతాయని, తద్వారా వేగవంతమైన ఆర్థికవృద్ధి సాధ్యమని కేంద్ర ప్రభుత్వ వాదనగా ఉంది. కాగా, ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని కాంగ్రెస్ కొట్టిపారేస్తోంది. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ మనుగడకు ఇప్పుడున్న పద్ధతిలోనే ఎన్నికల నిర్వహించాలని అంటోంది.

## ఎల్ఐసీ బీమా సఖి యోజన ప్రారంభం



మహిళలకు ఆర్థిక సాధికారిత కల్పించేందుకు ఎల్ఐసీ బీమా సఖి యోజనను ప్రధాని మోదీ హర్యానాలోని పానిపట్‌లో సోమవారం ప్రారంభించారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత అర్హతగా కలిగిన 18-70 ఏండ్ల మధ్య వయసు గల మహిళలు ఎల్ఐసీ ఏజెంట్లు అయ్యేందుకు ఈ పథకం అవకాశం కల్పిస్తుంది. ఈ పథకం ద్వారా ఒక లక్ష మంది మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం, ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ పథకంలో అర్హులైన మహిళలకు మూడేండ్ల పాటు స్టైపెండ్ పొందే అవకాశం కలిగిన శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత వారు ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేస్తూ పాలసీల అమ్మకం ద్వారా కమీషన్లు పొందవచ్చు.

## సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సెప్టెంబరులో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైనవారి రోల్ నంబర్లను upsc.gov.in లేదా upsconline.nic.in వెబ్‌సైట్లలో చూడొచ్చు. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్లను సందర్శించి, తమ ఫలితాలను తెలుసుకోవచ్చు. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) కోసం ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత షెడ్యూలు వివరాలను యూపీఎస్సీ త్వరలో తెలియజేస్తుంది.

## ఢిల్లీలో 40 స్కూళ్లకు బాంబు బెదిరింపులు

ఢిల్లీలోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. నగరంలోని సుమారు 40 పాఠశాలలకు సోమవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఈ మెయిల్స్ పంపిన వ్యక్తి 30వేల డాలర్ల(సుమారు రూ.25 లక్షలు) డిమాండ్ చేశాడని, దీంతో ఆయా స్కూళ్లలో తనిఖీలు నిర్వహించామని పోలీసులు వెల్లడించారు. అయితే అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని పేర్కొన్నారు. మెయిల్స్ అన్నీ ఒకే ఈ-మెయిల్ నుంచి వచ్చినట్టు పోలీసులు గుర్తించారు



## మతం ఆధారంగా రిజర్వేషన్లు తగదు

మతం ఆధారంగా రిజర్వేషన్ల కేటాయింపు కుదరదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ముస్లిం సముదాయాలకు ఓబీసీ కులాల హోదాను ఇచ్చి.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించడాన్ని తప్పుబట్టిన కోల్‌కతా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ముస్లిముల్లోని 77 తరగతులకు పశ్చిమ బెంగాల్ రిజర్వేషన్ల చట్టం కింద, మరో 37 తరగతులకు పశ్చిమబెంగాల్ వెనుకబడిన తరగతుల చట్టం కింద 2010 నుంచి బెంగాల్ ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పిస్తోంది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై మే 22న కోల్‌కతా హైకోర్టు తీర్పును ఇచ్చింది. ఆయా సముదాయాలను ఓబీసీలుగా గుర్తించడంలో వెనుకబాటుతనం కంటే మతమే ప్రధాన అంశంగా పని చేసినట్టు కనిపిస్తోందని తన తీర్పులో హైకోర్టు తెలిపింది. ముస్లిముల్లో వెనుకబడ్డాయంటూ కొన్ని తరగతులను ఎంపిక చేయడం మొత్తంగా ముస్లిం సమాజాన్ని అవమానించినట్టే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ తరగతులకు రిజర్వేషన్ల కేటాయింపును నిలుపుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సహా పలు సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. మతం ఆధారంగా కాక, వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకునే ఆయా సముదాయాలకు రిజర్వేషన్లు కేటాయించారని, కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని ఆయన కోరారు.



# అన్నదాతల 'ఢిల్లీ చలో' ఉద్రిక్తం

### కొందరికి గాయాలు.. పాదయాత్ర నిలిపివేత

అన్నదాతల ఆందోళనలతో పంజాబ్, హరియాణా సరిహద్దు ప్రాంతం శంభు ఆదివారం అట్టుడికింది. కనీస మద్దతు ధర సహా 12 డిమాండ్ల సాధనకు పిలుపునిచ్చిన 'ఢిల్లీ చలో' ఉద్రిక్తంగా మారింది. రైతులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా హరియాణా ప్రభుత్వం శంభూ సరిహద్దులో భారీగా పోలీసులు, పారా మిలిటరీ బలగాలను మోహరించింది. పోలీసులు పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు రైతులు పాదయాత్ర మొదలు పెట్టేందుకు సిద్ధం కాగా అనుమతి ఉంటే చూపించాలని పోలీసులు కోరారు. రైతులు బారికేడ్లు దాటుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు లాఠీచార్జ్ చేశారు. టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో కొందరు రైతులు గాయపడ్డారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం 'ఢిల్లీ చలో' పాదయాత్రను నిలిపివేస్తున్నట్టు రైతు సంఘాల నేతలు ప్రకటించారు. పోలీసుల లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంతో ఎనిమిది మందికిపైగా రైతులు గాయపడ్డారు. "పోలీసులు 101 మంది రైతులకు అనుమతి ఇస్తామని చెప్పారు. కానీ అక్కడికి వచ్చిన తర్వాత అనుమతి లేదని లాఠీచార్జ్ చేశారు" అని రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు.





## భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ తుశిల్

అధునాతన 'ఐఎన్ఎస్ తుశిల్' యుద్ధ నౌక భారత నౌకాదళంలో చేరింది. రష్యాలో తయారైన ఈ యుద్ధ నౌక.. సోమవారం ఆ దేశంలోని కాలినిన్‌గ్రాడ్‌లో భారత నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ నావల్ స్టాఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 3,900 టన్నుల బరువు, 125 మీటర్ల పొడువుగల ఐఎన్ఎస్ తుషీల్‌ను త్వరలోనే హిందూ మహాసముద్రంలో భారత్ మోహరించనున్నది. చైనా నేవీని దీటుగా ఎదుర్కొనటంలో, భారత నౌకాదళాల సామర్థ్యాన్ని పెంచటంలో 'ఐఎన్ఎస్ తుశిల్' కీలక పాత్ర పోషిస్తుందని భారత్ భావిస్తున్నది.

## టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం



తమిళనాడు రాష్ట్రంలోని మధురై నగరంలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. వాటర్ రిసోర్స్ మినిస్టర్ దురై మురుగన్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీ ప్రవేశపెట్టారు. కేంద్ర సర్కారును ఈ తీర్మానం తీవ్రంగా విమర్శించింది. తమిళనాడు అభ్యంతరాలను లెక్కచేయకుండా కేంద్రం మధురైలో టంగ్‌స్టన్ మైనింగ్‌కు అనుమతులు ఇచ్చిందని మండిపడింది. అసెంబ్లీలో తీర్మానానికి ఆమోదం లభించడానికి ముందు దీనిపై తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. చివరకు ఆ తీర్మానానికి సభ ఆమోదం లభించింది. కేంద్ర ప్రభుత్వం మధురై నగరంలోని టంగ్‌స్టన్ గనులను తవ్వడానికి వేదాంత గ్రూప్‌కు అనుమతి ఇచ్చింది. దీనిపై అక్కడి అరిట్టపట్టి వాసులు ఆందోళనకు దిగారు. మైనింగ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో రాష్ట్ర సర్కారు మైనింగ్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది.



## చేతబడి నెపంతో 110 మంది వృద్ధుల ఊచకోత ..హైతీలో అమానుషం

చేతబడి చేసి తన బిడ్డను అనారోగ్యం పాల్జేశారన్న అనుమానంతో హైతీలోని నేర సామ్రాజ్యానికి చెందిన ఓ ముఠా నాయకుడు రాజధాని సిటి సోలీల్‌లోని మురికివాడలో నివసించే దాదాపు 110 మంది వృద్ధులను గత వారాంతంలో హతమార్చినట్లు జాతీయ మానవ హక్కుల రక్షణ వ్యవస్థ(ఆర్ఎన్‌డీడీహెచ్) వెల్లడించింది. మృతులందరూ 60 ఏళ్లు పైబడినవారేనని హక్కుల సంస్థ పేర్కొంది. తన బిడ్డ అనారోగ్యానికి గురికావడంతో వార్ఫ్ జెరెమీ అనే గ్యాంగుకు చెందిన నాయకుడు మోనెల్ మికనో ఫెలిక్స్ ఈ ఊచకోతకు ఆదేశించినట్లు సంస్థ వివరించింది. మురికివాడకు చెందిన వృద్ధులు చేసిన చేతబడి వల్లే బిడ్డకు హాని జరిగిందని వూడో పూజారి ఆరోపించడంతో ఫెలిక్స్ ఈ దారుణానికి పాల్పడినట్లు హక్కుల సంస్థ పేర్కొంది.

## మాస్కోలో సిరియా అధ్యక్షుడు.. అసద్‌కు రష్యా ఆశ్రయం



సిరియా అధ్యక్షుడు బాషర్ అసద్‌కు.. రష్యా ఆశ్రయం కల్పించింది. అతను మాస్కో చేరుకున్నట్లు క్రెమ్లిన్ వర్గాలు పేర్కొన్నాయి. హయత్ తాహ్రిర్ అల్ షామ్ జిహాదీలతో పాటు ఇతర ప్రభుత్వ వ్యతిరేక తీవ్రవాదులు శనివారం దేశ రాజధాని డమస్కస్‌లోకి ప్రవేశించాయి. ఆ ఉగ్రదళాలు దేశ రాజధానిని నియంత్రణలోకి తెచ్చుకున్నాయి. సిరియా అధ్యక్ష పదవి నుంచి బాషర్ అసద్ తప్పుకున్నట్లు రష్యా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఇస్లామిక్ దళాలతో జరిపిన చర్చల తర్వాత సిరియా అధ్యక్షుడు దేశం విడిచి వెళ్లినట్లు కూడా రష్యా కన్ఫర్మ్ చేసింది. అసద్‌తో పాటు ఆయన కుటుంబం కూడా మాస్కో చేరుకున్నట్లు రష్యా వర్గాలు వెల్లడించాయి. ప్రజలు ఎన్నుకున్న నాయకుడికి సహకరిస్తామని సిరియా ప్రధాని మోహమ్మద్ అల్ జలాలీ తెలిపారు. ఆల్‌ఖయిదా మాజీ కమాండర్ జాబత్ అల్ నుస్రా నాయకత్వంలోని హెచ్‌టీఎస్ గ్రూపు.. గత వారం సిరియాలోని ఇడ్లిబ్ ప్రావిన్సు నుంచి తీవ్ర దాడులకు దిగింది. అలెప్పో, హమా, హోమ్స్, అల్ కుసైర్ నగరాల నుంచి సిరియా దళాలను ఆ జిహాదీలు పారద్రోలాయి. అమెరికా మద్దతు ఇస్తున్న ఫ్రీ సిరియన్ ఆర్మీ.. పురాతన పల్మైరా నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

# ఇండ్ల నిర్మాణం నాసిరకం....
# లబ్ధిదారులు ఎంపిక అవినీతిమయం......

## – సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 09**

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంలో అవినీతి రాజ్యమేలుతూ నాసిరకంగా నిర్మిస్తున్నారని నిర్మాణాలు పూర్తి కాకుండానే హడావుడిగా అధికారులు పంపిణీ సిద్ధం చేయడం సరైనది కాదని గ్రామసభ ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయింపు చేయాలని సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏం సి కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు పాత్రికేయ బృందంతో కలిసి పరిశీలించిన పార్టీ బృందం నాసిరకంతో ఇండ్లు నిర్మించిన ఫలితంగా పగుళ్లకు గురై బీటలు వారిన గోడలను, కుంగిపోయిన ఫ్లోర్లను మీడియాకి చూపించారు. ఈ సందర్భంగా మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జిల్లా స్థాయి అధికారులు వచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ల వద్ద కరెంటు మీటర్లు గాని బోరు గాని లేవని ఇవి గతంలోనే చోరీకి గురి అయినాయని అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నేటికీ ఆ సమస్య పరిష్కరించలేదని నీళ్లు లేక కరెంటు లేకుండా లబ్ధిదారులు ఎలా ఉంటారని ప్రశ్నించారు. 110 ఇల్లు పూర్తి అయిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తయిందని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని పంచాయతీ పరిధిలో గ్రామసభ పెట్టి లబ్ధిదారులు ఎంపిక చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇండ్ల నిర్మాణం నాశరకం లబ్ధిదారులు ఎంపికలు అవితిమయం స్పష్టంగా కనబడుతుందని ఆయన ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ లో జరుగుతున్న ఈ అవినీతి అక్రమాలపై సిపిఐఎం ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. అదేవిధంగా 2017 వ సంవత్సరంలో ఎమ్మెల్యే సున్నం రాజయ్య హయాంలో ఇచ్చిన 250 ఇండ్లకు నేటికీ అధికారులు లబ్ధిదారుల పేరు మీద పట్టాలు ఇవ్వలేదని వెంటనే వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం గంగ, ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారేల్లి సంతోష్ కుమార్,పట్టణ కమిటీ సభ్యులు ఉస్తెల జ్యోతి, కుంజ శ్రీనివాస్, ఎన్ నాగరాజు ధనకొండ రాఘవయ్య , ఎస్.అజయ్ కుమార్ ఛాట్ల శ్రీనివాస్ డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సతీష్ బాబు మాజీ వార్డ్ మెంబర్ మడెం లక్ష్మి స్థానిక నాయకులు కుంజా విజయ,సున్నం ప్రవీణ్ ,సాగరిక తదితరులు పాల్గొన్నారు.





## గుగ్గిలలో సిసి రోడ్ల పనులకు భూమి పూజ

**కొప్పరపు రాజిరెడ్డి ప్రజా తీర్పు ప్రతినిధి బెజ్జంకి**

మండలంలోని గుగ్గిళ్ళ గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఆదేశానుసారం ఈజీఎస్, ఎస్డిఎఫ్, డి ఎం ఎస్ టి, నిధులు 29 లక్షలతో సీసీ రోడ్డు పనులనుఎంపీడీవో కడివేరి ప్రవీణ్,బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒగ్గు దామోదర్,మండల పార్టీ అధ్యక్షులు ముక్కిసారత్నాకర్ రెడ్డి,మండల గౌడ సంఘ అధ్యక్షుడు చెప్పాల శ్రీనివాస్ గౌడ్, పి ఆర్ ఏ ఈ సమ్మయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిపి కార్యదర్శి వంశీధర్,ఫీల్డ్ అసిస్టెంట్ ర్యాకం రాజు, బోయిని ప్రశాంత్, గుగ్గిళ్ళ మధు, తొలిసారి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## ఐటీసీ మిషన్ సునెప్రా కళ్ సంస్థ చేతల మీదగా సామూహిక వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 09**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపహాడ్ మండలంలో ఉన్నటువంటి గౌతపురం అంగన్వాడి సెంటర్లో ఐటిసి సంస్థ కు అనుసంధానంగా ఉన్నటువంటి మిషన్ సునెప్రా కళ్ (ఐ జి డి) సంస్థ వారు గర్భిణి స్త్రీలకు శ్రీమంతం నిర్వహించి వారికి వస్త్రాలు అందించారు, అదేవిధంగా ఆరు నెలలు నిండినటువంటి చిన్నపిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమం చేసి చిన్న పిల్లలకు బొమ్మలు, ఉగ్గు తినుటకు గిన్నె లు అందించారు. ఈ కార్యక్రమం ఇలా జరిపించినటువంటి ఐటీసీ అనుసంధానం ఐ జి డి సంస్థకు గర్భిణీ స్త్రీలు బాలింత తల్లులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈ సంస్థ వారు మరిన్ని మంచి కార్యక్రమాలు చేసి ప్రజలు ఆదుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐ జి డి.( ఎన్ జి ఓ) ప్రాజెక్ట్ ఆఫీసర్ గీతా .డిస్టిక్ ప్రాజెక్టు హెడ్ అనిల్ ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రమీల ప్రశాంతి భారత్ . అంగన్వాడి సెంటర్ టీచర్ అంగన్వాడి సూపర్వైజర్ శకుబాయి. ఏఎన్ఎం. ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**పఠాన్ చేరు ప్రజాతీర్పు ప్రతినిధి**

మెదక్ ఎంపీ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ క్యాంప్ కార్యాలయం లో తెలంగాణ తల్లి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు నీలం మధు ముదిరాజ్ తో సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ మరియు జిన్నారం మండల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జింక గణేష్ గుమ్మడిదల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రామచందర్ సోనియా గాంధీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వరిగుంతం కృష్ణ మాట్లాడుతూ నీలం మధు ముదిరాజ్ క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ తల్లి అయినటువంటి సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నీలం మదన్న తో జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అదే విధంగా నా మిత్రులు నూతనంగా ఎన్నికైన జిన్నారం మండల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా జింక గణేష్ అందేవిధంగా గుమ్మడిదల మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా భారీ మెజార్టీతో గెలుపొందిన రామచంద్ర కి శుభాకాంక్షలు అభినందనలు నీలం మధు తెలియజేసినందుకు చాలా సంతోషమని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఫారుక్ నర్సింలు తరుణ్ వివిధ జిల్లాల నాయకులు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**భీమదేవరపల్లి,డిసెంబర్ 9( ప్రజా తీర్పు విలేఖరి )**

60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తరువాత ప్రజల ఆకాంక్షను నెరవేర్చి ప్రత్యేక తెలంగాణను అందించిన శ్రీమతి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో ఘనంగా జరిగాయి.యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేకులు కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య నాయకులు కొలుగూరి రాజు ఆదరి రవీందర్ ఊసకోయల ప్రకాష్ చంద్రశేఖర్ గుప్తా శ్రీరామోజు సమ్మయ్య చిదర శివకుమార్ డబ్బా శంకర్ మార్పాటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**కొప్పరపు రాజిరెడ్డి ప్రజా తీర్పు ప్రతినిధి బెజ్జంకి**

మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముఖ్యస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం 1969 నుండి జరిగిన అనేక ఉద్యమాలు, బలిదానాలను దృష్టిలో ఉంచుకొని ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తామని 2004లో కరీంనగర్ బహిరంగ సభలో సోనియా గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్ర ఏర్పాటుకు 2009లో అప్పటి కేంద్ర హెూం మంత్రి చిదంబరం ప్రకటన చేశారని, ప్రజల కలలు నెరవేరడమే కాకుండా 2014లో ఏర్పాటు చేశారు. ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరంగా పాటుపడే గాంధీ కుటుంబ వారసత్వం నుండి ప్రజల మన్నులు పొంది నేడు కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు పట్టం కట్టాలని పేర్కొన్నారు. గుగ్గిళ్ళ పోతారం గ్రామాల్లో నిర్మిస్తున్న ఇథానాల్ ఫ్యాక్టరీ అనుమతులను గతంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, బిఆర్ఎస్ టిఆర్ఎస్ ప్రభుత్వ పాపమే అని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు రుణమాఫీ చర్చకు సిద్ధమని చెప్పి బిఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ విసిరారు. రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల కోసం ప్రజలను మోసం చేసేందుకు బి ఆర్ఎస్ నాయకులు మొసలి కన్నులు కారుస్తున్నారని ఈ కార్యక్రమంలో వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి పల్లి రాజు, జల్ల ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి లింగాల శ్రీనివాస్, చెన్నారెడ్డి, గూడేలి శ్రీకాంత్,కొంకటి రాములు,ఐలేని శ్రీనివాస్ రెడ్డి, బండి పెల్లి శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శరీర దానానికి ముందుకు వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు

### అభినందించిన ఉపాధ్యాయులు స్నేహితులు

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 9 )**

తన పదవీ విరమణ సభలో మరణానంతరం దేహ దానం కోసం ముందుకు వచ్చారు ఓ ఉపాధ్యాయుడు. ఇటీవల ఉద్యోగ సంఘాల నేత, విశ్రాంత ఎంఈఓ వీరగోని పెంటయ్య తన సతీమణి లక్ష్మి మృతిచెందగా ఆమె పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల కోసం చలి మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థకు అందజేసిన విషయం తెలిసిందే. ఆ స్ఫూర్తితోనే తాము కూడా మరణానంతరం దేహ దానం చేస్తామని సదరు ఉపాధ్యాయ దంపతులు ప్రకటించారు.పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు నేదునూరి కనకయ్య పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా రేణుక – కనకయ్య దంపతులు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు టి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో శరీరదానానానికి ముందుకు రాగా వారిని ఫౌండేషన్ ప్రతినిధులు శాలువతో సత్కరించి,గ్రీన్ గిఫ్ట్ జ్ఞాపిక అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ సభ్యునిగా నేత్ర, అవయవ ,శరీర దాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే అవకాశం లభించింది అన్నారు. ఈ కార్యక్రమాల స్ఫూర్తితో మరణానంతరం తమ దంపతులుదేహదానం చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఆదర్శవంతమైన ఈ నిర్ణయం పట్ల పదవీ విరమణ సభకు అతిథులుగా విచ్చేసిన మండల విద్యాధికారులు సురేంద్ర కుమార్,ఆగయ్య,జిల్లా టిపిటి ఎఫ్ నాయకులు పోచయ్య, పరుశురాములు,రాజనర్సు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు జానకి, ప్రాథమిక పాఠశాల హెచ్.యం సుమిత్ర,గ్రామ నాయకులు నర్సింహా రెడ్డి, తిరుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, కనుకయ్య చిన్ననాటి స్నేహితులు నర్సయ్య,రాజయ్య,ఎర్రన్న , కిష్టయ్య దేహదాన నిర్ణయం తీసుకున్న దంపతులను సత్కరించి, వారి నిర్ణయాన్ని అభినందించి, ధన్యవాదాలు తెలిపారు.



## సజావుగా కొనసాగుతున్న కొనుగోలు కేంద్రం

### అంబారిపేట గ్రామ రైతుల ఉద్ఘాటన

**ఎండపల్లి,డిసెంబర్09 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేటలో జిల్లా డిసిఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సజావుగా కొనసాగుతుందని అంబారిపేట గ్రామ రైతులు ముక్తకంఠంతో ఉద్ఘాటించారు. అంబారిపేట గ్రామంలో గత 20 ఏళ్ల క్రితం ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారని, అప్పట్లో గ్రామైక్య సంఘాల ద్వారా కొనుగోలు జరిపే వారని, అనివార్య కారణాలవల్ల ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రాన్ని అంబారిపేటలో రద్దు చేశారు. అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో పిఎసిఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, అంబారి పేట గ్రామంలో మాత్రం జిల్లా డిసిఎంఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని గత నాలుగేళ్ల క్రితం ప్రారంభించారు. కాగ డిసిఎంఎస్ కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, గత ప్రభుత్వం రైతులకు కటింగ్ పేరుతో కుచ్చు టోపి పెట్టారని గ్రామ రైతులు వాపోయారు. ప్రస్తుతం ప్రజా పాలనలో రేవంత్ రెడ్డి సర్కార్ లో, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో రైతులకు ఎలాంటి కటింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేశారని రైతులు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన ఐదు రోజుల లోపే తమ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రోద్బలంతో రైతులకు ఎలాంటి కటింగ్ లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేశామని, అకాల వర్షం కారణంగా ఇంకా ఐదు శాతం మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని కొనుగోలు కేంద్ర నిర్వాహకులు ఎలుక రాజు యాదవ్ మీడియా సమక్షంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు తనువుల ఎల్లయ్య, ఎలుక శంకరయ్య, పల్లికొండ బక్కయ్య, తనుగుల సత్యనారాయణ, అల్లంల రాజయ్య, ఎలుక నర్సయ్య,వంగపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# సోనియా దయ వల్లే తెలంగాణ ఏర్పాటు

## కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ధర్మయ్య

## కోహెడలో ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ డిసెంబర్ 9 )**



కాంగ్రెస్ అగ్ర నేత ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు ఎంపీ సోనియా గాంధీ జన్మదిన వేడుకలు సోమవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఘనంగా నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మంద ధర్మయ్య మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను గుర్తించి యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ మునుగుతుంది అని తెలిసినా పదవులు ముఖ్యం కాదని ప్రజల ఆకాంక్ష ముఖ్యమని తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ దయ వల్లనే సాధ్యం అయిందని అసెంబ్లీ సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు . విద్యార్థుల ఆత్మ బలిదానాలు, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పై పార్లమెంటులో పెప్పర్ స్ప్రే దాడిని చూసి చలించిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని తెలిపారు .తర్వాత 10 సంవత్స రాలు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లో అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్ సౌకర్యం, 10లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలు,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్,అర్హులైన రైతులకు 2 లక్షల రుణమాఫీ,ఉచిత విద్యుత్,సిఎం రిలీఫ్ ఫండ్, కళ్యాణ లక్ష్మీ పథకం అమలు,మండల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజు, వైస్ చైర్మన్ భీమ్ రెడ్డి తిరుపతిరెడ్డి, కొమురవెల్లి దేవస్థాన డైరెక్టర్ చిగిరి కొమురయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ చింతకింది శంకర్,మండల నాయకులు శెట్టి సుధాకర్, బందెల బాలకిషన్, బొలు మల్ల చంద్రయ్య, పోలోజు సుదర్శన్, సంగెం కిషన్, పాము శ్రీకాంత్, ముంజ శ్రీనివాస్, ఇట్టిరెడ్డి నర్సింహారెడ్డి, చెన్నా రెడ్డి,మహేశ్వర్ రెడ్డి, తాటిపాముల లింగం, బైరి సుధాకర్, నక్క అనిల్,పిల్లి సత్యనారాయణ, మల్యాల శ్రీనివాస్ రెడ్డి,గాదాసు రాజేందర్,మైనార్టీ సెల్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ అంకుస్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు గూడ స్వామి,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కాంతాల శివా రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు.. బీనవేణి రాకేష్, మంద శ్రీనాథ్ మహర్షి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముంజ శివ సాయి గౌడ్,గ్రామ అధ్యక్షులు వరికోలు శనిగరం తిరుపతి, బస్వాపూర్ తాటిపాముల ప్రవీణ్ గౌడ్, కురెళ్ళ బండారి రవీందర్, వెంకటేశ్వర్లపల్లి తూటి రాజిరెడ్డి,అరేపల్లి బూర్గుల రమేశ్, రామచంద్రాపురం బత్తుల రాజు, శ్రీరాముల పల్లి పోలు శ్రీనివాస్, ధర్మసాగర్ పల్లి కరివేద చంద్రా రెడ్డి, పరివేద చాద రాజ మల్లా రెడ్డి, పోరెడ్డి పల్లి పాతూరి ప్రభాకర్ రెడ్డి, రేవోజు చక్రపాణి, శనిగరం రామస్వామి, కొత్తూరి సదానందం పాల్గొన్నారు.



## ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

**ఎండపల్లి, డిసెంబర్09( ప్రజా తీర్పు ప్రతినిధి )**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలుక రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎలక రాజు యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ద్వారానే తెలంగాణ ప్రజల గత 60 ఏళ్ల కల తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలంతా రుణపడి ఉంటారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తే, ఆంధ్రాలో తన పార్టీకి మనగడ ఉండదని తెలిసినా కూడా సావాసం చేసి తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియా గాంధీదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక గత పదేళ్లుగా పరిపాలించి అప్పుల ఊబిలోకి దించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దని, ప్రస్తుతం ప్రజా పాలనలో సోనియాగాంధీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రమంతా, అలాగే ధర్మపురి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నేతృత్వంలో ప్రజలంతా సుభిక్షంగా వర్ధిల్లుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాడి రాజేశం, తనువుల సత్యనారాయణ గౌడ్, ఎలుక శంకరయ్య, గుమ్ముల శ్రీనివాస్, అల్లంల రాజయ్య, కోమటిపల్లి అఖిల్, గుమ్ముల బుచ్చయ్య, బోరే స్వామి, ధర్మాజీ లక్ష్మణ్, మోతే రాజయ్య,పల్లికొండ సతీష్, యాదగిరి, మంచినీళ్ళ కుమారస్వామి, పల్లికొండ మల్లేష్, చెరుక మల్లేశం, గుమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీమతి సోనియా గాంధీ జన్మదినం సందర్బంగా బాటసింగారం పండ్ల మార్కెట్ లో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి

**రంగారెడ్డి జిల్లా (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

ఆరు దశాబ్దాల ఆకాంక్ష, నాలుగు కోట్ల ప్రజల చిరకాల స్వప్నం తెలంగాణ రాష్ట్ర సాకారం చేసిన తెలంగాణ తల్లి గా శ్రీమతి సోనియా గాంధీ గారికి తెలంగాణ రాష్ట్రం ఋణపడి ఉంటుంది.గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి. డిసెంబర్ 9th శ్రీమతి సోనియాగాంధి జన్మదినం సందర్భంగా మలక్ పేట యశోద హాస్పటల్స్ సహకారంతో బాటసింగారం పండ్ల మార్కెట్ లో పలు రంగాలలో అనుభవమైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరంని ఏర్పాటు చేయడం జరిగింది... హమాలీలు, రైతులు,వర్తకులు, మార్కెట్ సిబ్బంది,పాలకవర్గం అందరూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఎంతో విలువైన పరీక్షలను పాలకవర్గం తరపున రైతులకు ఉచితంగా చేపించడం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.... సోనియా గాంధీ కృషి వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని వారికి మనం అంతా ఋణపడి ఉంటామని అన్నారు.అమరుల త్యాగాలను చూసి చలించి అప్పటి UPA కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి తెలంగాణ కలను సాకారం చేసిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా రైతులకు అనేక రకాల ప్రోత్సాహకాలను అందించిన ఘనత మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్ వైస్ చైర్మన్ Ch,బాస్కర చారి మార్కెట్ డైరక్టర్లు....రఘుపతి రెడ్డి అంజయ్య...గణేష్ నాయక్... వెంకట్ గుప్తా ఇబ్రహీంతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ మరియు యశోద డాక్టర్లు Dr.అరవింద్.. Dr.మౌనిక... Dr.ఉమాదేవి.. Dr.సూర్య...వాసు కిరణ్...శ్రీధర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.






# దళిత జర్నలిస్టుల ఫోరమ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

## వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, సందీప్, డిసెంబర్ 09**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం లో 09 డిసెంబర్ దళిత జర్నలిస్టుల ఫోరమ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కాషాపోగు జాన్ ఆదేశాల మేరకు దళిత జర్నలిస్టు ఫోరం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న కుమార్ ఆధ్వర్యంలో దళిత జర్నలిస్టుల ఫోరమ్ 10 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు కొత్తగూడెం ఎస్సీ ఎస్టీ పిసి మైనార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా కేకులు కట్ చేసి అంగరంగ వైభవంగా సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తున్న దళిత నాయకులను నాయకురాళ్లను పలువురిని దళిత జర్నలిస్టు పోరం ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టు ఫోరం ద్వారా దళిత జర్నలిస్టుల సమస్యల కొరకు గత పది సంవత్సరములుగా అలుపెరుగని పోరాటం చేస్తూ దళిత జర్నలిస్టులను చైతన్యం పరుస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దళితులు అంటేనే చులకనగా చేసే ఈ సమాజంలో దళిత జర్నలిస్టు సమస్యలను నిరంతరం పోరాటం చేస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జాన్ సెక్రటరీ డేవిడ్ రాష్ట్రప్రభుత్వం దృష్టికి అనేక సమస్యలు తీసుకెళ్లడం జరిగింది. దళిత జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక చట్టం అమలు చేయాలని దళిత బంధు లాగా అంబేద్కర్ అభయహస్తం ద్వారా 12 లక్షలు దళిత జర్నలిస్టులకు మొదటి విడతగా అందజేయాలని. డబల్ బెడ్ రూములు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో దళిత జర్నలిస్టులకు మొదటి విడుదల అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి యువజన మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ , అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత, జర్నలిస్ట్ బరిగెల భూపేష్ కుమార్. మేదిని లక్ష్మి రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మహిళా సమైక్య నాయకురాలు కరిష రత్నకుమారి నక్క సృజన కూరపాటి రవీందర్ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బరిగెల సంపూర్ణ . దళిత జర్నలిస్టు ఫోరం తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ శెట్టి గోపి రవీందర్ బుపేష్ నాగయ్య వినోద్ వికాస్ తదితర నాయకులు పాల్గొన్నారు దళిత జర్నలిస్ట్ ఫోరం సభ్యులు దళిత నాయకులు పాల్గొన్నారు.

## జిన్నారం ఎంఈఓకు వినతి పత్రం

**పటాన్ చేరు ప్రజా తీర్పు ప్రతినిధి**

రాష్ట్ర సమగ్ర శిక్ష సంఘం పిలుపుమేరకు రేపటి నుండి విధులను బహిష్కరిస్తూ,నిరవధిక సమ్మెకు వెళు తున్నట్టు జిన్నారం మండల ఎంఈఓ కుమారస్వామికి జిన్నారం మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఐఎస్ కోఆర్డినేటర్ శైలజ సమక్షంలో సమ్మెనోటీస్ అందజేశారు కార్యక్రమంలో సీఆర్పీలు శ్రీనివాస్ వేణు రజిత భాస్కర్ మెసెంజర్ కృష్ణ పాల్గొన్నారు.





## తెలంగాణ సమాజ ఆకాంక్షలు నెరవేర్చుతాం

### సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇదీ..

### తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ – సోనియమ్మ జన్మదినం

### అప్పుల రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాం: KLR

**మహేశ్వరం నియోజకవర్గం (ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...**

ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతామని మాజీఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు.సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ o తెలంగాణ రాష్ట్ర కల సాకారం చేసిన కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ గారి జన్మదినం ఒక్కరోజే కావటం చరిత్రలో లిఖించదగ్గ రోజు అని హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేటు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని మరోసారి చెప్పారు. యువత ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారని KLR తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం సహా ప్రజాపాలన విజయోత్సవాలపై బీఆర్ఎస్- బీజేపీ చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టాలని లక్ష్మారెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.సోనియాగాంధీ గారి జన్మదిన సందర్భంగా సేవ కార్యక్రమాలు చేసిన కాంగ్రెస్ శ్రేణులను కిచ్చెన్న అభినందించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసిన మహేశ్వరం నియోజకవర్గం హస్తం పార్టీ సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు KLR.




# రాష్ట్రంలోనే రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..



## మంగాయి సందీప్ రావు ట్రస్ట్ ద్వారా కుబీర్ ఉర్దూ మీడియం పాఠశాలకు విరాళం.

(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్,డిసెంబర్ 09)

మండల కేంద్రమైన కుబీర్ లోని ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగాయి సందీప్ రావు ట్రస్ట్ ద్వారా సోమవారం మినరల్ వాటర్ పరికారం తో పాటు పదోవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను అందజేశారు,ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మంగాయి సందీప్ రావు ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగాయి సందీప్ రావు ట్రస్ట్ ద్వారా పాఠశాలలో మినరల్ వాటర్ పరికారాన్ని అందించి,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లను అందజేశామని తెలిపారు,ప్రతి ఒక్కరూ, విద్యార్థులు ఆరోగ్యం ఉండాలని సూచించారు, విద్యార్థులు మంచిగా చదివి తల్లి తండ్రుల, ఉపాధ్యాయులు పేరు నిలబెట్టాలని అన్నారు,ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జమీల్ అహ్మద్, ట్రస్ట్ సభ్యులు జావిద్ ఖాన్,ఆహద్,విలాస్,సతీష్,దిగాంబర్,ఆనంద్ తో పాటు గ్రామస్తులు అబ్దుల్ వాహేద్,ఏఖ్బాలోద్దీన్,మజర్, ఉపాధ్యాయులు, పోషకులు విద్యార్థులు,తదితరులు, పాల్గోన్నారు..



## మతం ఆధారంగా రిజర్వేషన్ ఉండొద్దు

న్యూఢిల్లీ: మతం ఆధారంగా రిజర్వేషన్ ఉండొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కలకత్తా హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2010 నుంచి 77 సామాజిక వర్గాలకు ఓబీసీ హోదాను కల్పించింది. వీటిలో అత్యధికం ముస్లిం మతానికి చెందిన వర్గాలు. ప్రభుత్వ నిర్ణయాన్ని కలకత్తా హైకోర్టు కొట్టివేసింది. 'ఈ సామాజిక వర్గాలను ఓబీసీలుగా ప్రకటించడానికి మతం ఒక్కటే ఏకైక ఆధారంగా కనిపిస్తున్నది' అంటూ హైకోర్టు అప్పుడు వ్యాఖ్యానించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం సహా పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లను సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం విచారించింది. బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సూత్రప్రాయంగా ముస్లింలు రిజర్వేషన్లకు అర్హులు కాదా అని వ్యాఖ్యానించగా, 'మతం ఆధారంగా రిజర్వేషన్ ఉండొద్దు' అని జస్టిస్ గవాయి బదులిచ్చారు.

**జనవరి 7కు విచారణ వాయిదా**

ఈ రిజర్వేషన్ మతం ఆధారంగా ఇచ్చింది కాదని, వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చిందని కపిల్ సిబల్ పేర్కొన్నారు. హిందువులకు సైతం వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్ ఉందని అన్నారు. రంగనాథ్ కమిషన్ కూడా ఈ వర్గాలకు రిజర్వేషన్ కల్పించాలని ప్రతిపాదించిందని, వీటిలో చాలా వర్గాలు కేంద్ర ఓబీసీ జాబితాలో ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు. హైకోర్టు తీర్పు కారణంగా 12 లక్షల మంది ఓబీసీ సర్టిఫికెట్లు రద్దయ్యాయని, వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల హక్కులను హైకోర్టు నిర్ణయం ప్రభావితం చేస్తున్నదని, హైకోర్టు తీర్పుపై స్టే విధించడంతో పాటు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. బెంగాల్ ప్రభుత్వం ఎలాంటి సర్వే చేయకుండా, బీసీ కమిషన్‌ను సంప్రదించకుండా రిజర్వేషన్లు కల్పించిందని ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది పత్వాలియా వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను జనవరి 7కు వాయిదా వేసింది.

## సివిల్స్ మెయిన్స్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సెప్టెంబరులో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలలో ఉత్తీర్ణులైనవారి రోల్ నంబర్లను upsc.gov.in,upsconline.nic.in వెబ్‌సైట్లలో చూడొచ్చు. అభ్యర్థులు ఈ వెబ్‌సైట్లను సందర్శించి, తమ ఫలితాలను తెలుసుకోవచ్చు. పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ) కోసం ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత షెడ్యూలు వివరాలను యూపీఎస్సీ త్వరలో తెలియజేస్తుంది. ఇంటర్వ్యూలు న్యూఢిల్లీలోని షాజహాన్ రోడ్, ధోల్‌పూర్ హౌస్‌లో ఉన్న యూపీఎస్సీ కార్యాలయంలో జరుగుతాయి.

## ఉచితాలు ఇంకెంత కాలం ?

న్యూఢిల్లీ: ఎంతకాలం ఈ ఉచితాలు అందచేయాలి అంటూ సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. కొవిడ్ మహమ్మారి మొదలైనప్పటి నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ లభిస్తోందని, దీనికి బదులుగా వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం, వారిలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2013 నాటి జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 81 కోట్ల మంది ప్రజలకు ఉచిత లేదా సబ్సిడీ రేషన్‌ను అందచేస్తున్నట్లు కేంద్రం ఇచ్చిన సమాచారంతో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీన్ని బట్టి పన్ను చెల్లింపుదారులు మాత్రమే మిగిలినట్టున్నారు అంటూ కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటిలను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2020లో కొవిడ్ కాలంలో మొదలైన వలస కార్మికుల కష్టాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పేర్కొంటూ ఓ ఎన్జీఓ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులందరికీ ఉచిత రేషన్ సమకూర్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోర్టును కోరారు. ఈ వలస కార్మికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి, నైపుణ్యాభివృద్ధిని పెంపొందిచడానికి మనం ఎందుకు పని చేయకూడదు? అని ప్రశ్నించింది.

### ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోస్లే నారాయణరావు పటేల్.

### ఘనంగా సోనియమ్మ జన్మదిన వేడుక.

(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 09)

భైంసా పట్టణం లోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో 78వ సోనియమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణను ఇచ్చింది సోనియమ్మ అని మన దేశం మన రాష్ట్రం బాగుపడేది కేవలం మన కాంగ్రెస్ పార్టీ తోనే నని అన్నారు.గత పది సంవత్సరాల నుంచి బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ అభివృద్ధిని వెనుక పెడుతూ జన్ధన్ ఖాతా అనుకుంటా ప్రతి పేద కుటుంబానికి 15 లక్షలు అకౌంట్లో వేస్తానని,రైతులకు దేశంలో రోడ్డున పడేస్తున్న బిజెపి ప్రభుత్వం ఈరోజు కాంగ్రెస్ హామీలను మర్చి పోతుందని అంటున్నారని విమర్శించారు. ప్రజలారా కార్యకర్తలారా మీరందరూ గమనించగలరు 10 సంవత్సరాలలో ఒక్కసారి కూడా ఏ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయలేదని కానీ తెలంగాణ రాష్ట్రంలో దేశంలోని తొలిసారిగా మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, సోనియమ్మ , భట్టి విక్రమ హయాంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత మన కాంగ్రెస్



పార్టీ దేనని అన్నారు. ప్రజలారా అభివృద్ధి వైపు చూడండి కాంగ్రెస్ కి అండగా నిలవండి మన పథకాల గురించి మన అభివృద్ధిని ప్రజలకు తెలియపరుస్తూ ముందుకు సాగాలని ఏ సమస్య ఉన్నా సరే మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వాలు 10 సంవత్సరాల నుండి విద్యార్థులకు రైతులకు వైద్య పరంగా విద్య పరంగా వ్యాపార పరంగా అనేక రకాలుగా పీడిస్తున్నయని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్రే,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఓం ప్రకాష్ లడ్డ, మాజీ ఎంపీపీ రామచంద్ర రెడ్డి, మైనారైటీ ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఎం. ఎ. లతీఫ్ మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ సమావేశాల్లోనే జమిలి

### బిల్లును ప్రవేశపెట్టనున్న కేంద్రం

### జేపీసీకి సిఫార్సు చేసే అవకాశం!

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లును ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సమాయత్తమవుతున్నది. ఈ మేరకు కసరత్తు చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బిల్లును సభలో ప్రవేశపెట్టిన తర్వాత విస్తృత సంప్రదింపుల కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీక (జేపీసీ) సిఫార్సు చేసే అవకాశం ఉన్నట్టు తెలిపాయి. ఈ బిల్లుపై చర్చించేందుకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీల స్పీకర్‌లనూ ఆహ్వానించనున్నట్టు సమాచారం. కాగా, జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇప్పటికే నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత 100 రోజులకు అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని కోవింద్ కమిటీ సిఫార్సు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సెప్టెంబర్‌లో 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నట్టు అప్పుడే ప్రచారం జరిగింది. అయితే, పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు బిల్లుపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరిపే బాధ్యతలను ప్రభుత్వం కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అర్జున్‌రామ్ మేఘ్వాల్, అప్పగించింది.

**రాజ్యసభ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం?**

తమ పట్ల వివక్షా వైఖరిని ప్రదర్శిస్తున్న రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు యోచిస్తున్నాయి. ఇందుకు సంబంధించిన తీర్మానంపై 50 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేసినట్టు ఆ వర్గాలు సోమవారం తెలిపాయి. రాజ్యసభ నుంచి తాము తరచు వాకౌట్ చేయాల్సిన పరిస్థితికి చైర్మన్ ధన్‌ఖర్ వైఖరే కారణమని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు చైర్మన్ తగినంత సమయాన్ని కేటాయించడం లేదని వారు భావిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మాట్లాడేందుకు లేచి నిలబడినపుడు చైర్మన్ ఆయనకు అవకాశం ఇవ్వాలని, కాని కాంగ్రెస్ అధ్యక్షుడు, సభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే లేచి నిలబడగానే మైక్రోఫోన్‌ను చైర్మన్ తరచు కట్ చేస్తున్నారని విపక్ష ఎంపీలు వాదిస్తున్నారు. పార్లమెంటరీ నిబంధనలు, సాంప్రదాయాల ప్రకారం సభ నడవాలని, కాని తాము ఫిర్యాదు చేసిన ప్రతిసారి తమను ఛాంబర్‌లోకి పిలిచి సర్దుబాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తున్నారే తప్ప నిబంధనలను పాటించాలని భావించడం లేదని సీనియర్ ప్రతిపక్ష నాయకుడు ఒకరు తెలిపారు. చైర్మన్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన పక్షంలో భారత పార్లమెంటరీ చరిత్రలోనే ఇది మొదటిసారి అవుతుంది.

**పార్లమెంటును కుదిపేసిన 'సోరోస్'**

అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోస్‌తో కాంగ్రెస్‌కు సంబంధాలు ఉన్నాయని బీజేపీ చేసిన ఆరోపణలు పార్లమెంటు ఉభయసభలను కుదిపేశాయి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి జార్జ్ సోరోస్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబేపై ప్రివిలేజ్ మోషన్ కోసం కాంగ్రెస్ సభ్యులు నోటీసు ఇచ్చారు. బీజేపీ అబద్ధపు ఆరోపణలు చేస్తున్నదని, దూబేపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. సోరోస్‌తో సంబంధాలపై కాంగ్రెస్ జవాబు చెప్పాలని బీజేపీ సభ్యులు సైతం నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొన్నది. మూడుసార్లు వాయిదా వేసినా సభ ఆర్డర్‌లోకి రాకపోవడంతో ఒక రోజు వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. సభ ప్రారంభం కాగానే సోరోస్ అంశాన్ని బీజేపీ సభ్యులు లేవనెత్తారు. సోరోస్‌తో కలిసి దేశాన్ని అస్థిరపరచాలని కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నదని బీజేపీ సభ్యులు ఆరోపిస్తూ నినాదాలు చేశారు. అయితే, అదానీ అంశం నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. ఇరువైపులా నినాదాలతో గందరగోళం నెలకొన్నది. పలుమార్లు సభ వాయిదా పడిన తర్వాత కూడా అధికార, విపక్ష సభ్యుల నినాదాలు కొనసాగడంతో రాజ్యసభ ఒక రోజు వాయిదా పడింది.





## బెంగాల్, బీహార్, ఒడిశా మావే

### బంగ్లాదేశ్ నేతల ప్రసంగాలపై మమతా బెనర్జీ ఆగ్రహం

కోల్‌కతా:భారత్, బంగ్లాదేశ్ సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. బెంగాల్, బీహార్, ఒడిశా రాష్ట్రాలు ఒకప్పుడు తమవేనన్న వాదనను బంగ్లాదేశ్ ప్రధాన ప్రతిపక్షం బీఎన్‌పీ తెరపైకి తీసుకొచ్చింది. బెంగాల్‌ను కొద్ది రోజుల్లోనే ఆక్రమించుకోచ్చని బంగ్లాదేశ్ ఆర్మీ వెటరన్స్ ప్రసంగించిన వీడియో ఒకటి కూడా వైరల్ అయ్యింది. బుధవారం (డిసెంబర్ 4న) ఢాకాలో నిర్వహించిన సమావేశానికి ప్రధాన రాజకీయ పార్టీలన్నీ హాజరయ్యాయి. బీఎన్‌పీ ప్రధాన కార్యదర్శి రుహుల్ కబీర్ రిజ్వీ మాట్లాడుతూ, 'బంగ్లాదేశ్‌పై భారతదేశపు దూకుడు వైఖరి ఇలాగే కొనసాగితే, మేం కూడా ఒకప్పుడు మా భూభాగాలైన బెంగాల్, బీహార్, ఒడిశాలను మాకివ్వాలని డిమాండ్ చేస్తాం' అని అన్నారు. సోమవారం ఢాకా యూనివర్సిటీ విద్యార్థులు భారత్‌కు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు.

**బంగ్లా నేతలపై మమత ఫైర్**

బంగ్లాదేశ్ నేతలు చేస్తున్న రెచ్చగొట్టే ప్రసంగాలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. విదేశీ శక్తులు ఆక్రమణకు వస్తే.. భారతీయులు లాలీపాప్‌లు తింటూ కూర్చుంటారా? అని చురకలంటించారు. సోమవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

**బంగ్లాలో మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన**

బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై భారత్ సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌తో తాము సానుకూల, నిర్మాణాత్మక, పరస్పర ప్రయోజనకర సంబంధాలను కోరుతున్నామని తెలిపింది. ఢాకాలో జరిగిన సమావేశంలో బంగ్లా విదేశాంగ కార్యదర్శి మొహమ్మద్ జషీమ్ ఉద్దీన్‌కు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ ఈ విషయాలను స్పష్టం చేశారు. షేక్ హసీనా భారత్‌కు పారిపోయిన తర్వాత భారత ఉన్నతాధికారి ఒకరు బంగ్లాదేశ్‌ను సందర్శించడం ఇదే మొదటిసారి. హిందువులపై దాడులు, హిందూ సాధువు చిన్మయ్ కృష్ణ దాస్ అరెస్ట్ కారణంగా ఇటీవల భారత్–బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు క్షీణించాయి.

# క్విక్ కామర్స్.. మేలా? కీడా?

'సరుకులు కావాలి మార్కెట్‌కి ఎప్పుడు వెళ్తారు' గోపాలం భార్య పదోసారి అడిగింది. గోపాలం మాత్రం మూడు రోజుల నుంచీ 'ఇదిగో తెస్తా, అదిగో వెళ్తా' అంటూ మాట దాటేస్తున్నాడు. ఇంట్లో ఒక్కొక్కటిగా అయిపోతున్న కందిపప్పు, చక్కెర కోసం గోపాలం కొడుకు గ్లాసు పట్టుకుని పక్కింటికీ ఎదురింటికీ తిరుగుతున్నాడు. ఇలాంటి సందర్భాలన్నీ ఇప్పుడు కథల్లో చదువుకోవాల్సిందే! ఇప్పటి పరిస్థితులు వేరు. ఇంట్లో ఏం నిండుకున్నా సరే%ూ% పది నిమిషాల్లోనే వాటిని అందించే సేవలు అందుబాటులోకి వచ్చేశాయి. అవి కూడా అత్యుత్తమ నాణ్యతతో, తక్కువ ధరలో! క్విక్ కామర్స్ పేరుతో విస్తరిస్తున్న ఈ సేవలు ఓ దశాబ్ద కాలం నుంచే అందుబాటులోకి వచ్చాయి. కానీ, వాటిని ప్రజలు అంతగా ఆదరించలేదు. నిరంతరం గిరాకీ లేకపోతే కానీ గిట్టుబాటు ఉండని ఆ రంగంలో చాలా కంపెనీలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. కానీ, కొవిడ్ రాకతో బండ్లు ఓడలయ్యాయి. ఇంటి నుంచి కదల్లేని పరిస్థితిలో అందరూ ఆన్‌లైన్ సేవలను ఉపయోగించుకున్నారు. నట్టింట్లో సినిమాల నుంచి వంటింటి భోజనం వరకూ%ూ% ఇంటి బాధ్యతలన్నీ ఆన్‌లైన్ కంపెనీలు తీసుకున్నాయి. అది కాస్తా ఇప్పుడు అలవాటుగా మారింది. కానీ, ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. ఈ క్విక్ కామర్స్ వల్ల మన జీవనశైలి ఎలా మారబోతున్నది. వీటితో అవసరమైన వస్తువులు అందుబాటులోకి రావడంసరే%ూ% ఆర్థిక రంగం నుంచి సామాజిక బంధాల వరకూ వీటి ప్రభావం ఎలా ఉండబోతున్నది? వీటి దెబ్బకు కిరాణా షాపులు మూతబడిపోతాయా? ఆర్డర్ చేసిన గంట లోపలే డెలివరీ. రోజువారీ అవసరాలకు కావాల్సిన సరుకులు ఏవైనా తెప్పించుకునే సౌలభ్యం. ఇంట్లోంచి తెప్పించుకున్నా ఎక్కువ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేకపోవడం%ూ% ఇదే క్విక్ కామర్స్! దీన్ని కొనుగోలు రంగంలో మూడో తరంగా భావిస్తున్నారు. మొదటి తరంలో ఎవరికి కావాల్సిన వస్తువులు వారే తెచ్చుకునేవారు. ఇంట్లో కావాల్సిన వస్తువులన్నీ దొరికేలా ఏదన్నా సూపర్ మార్కెట్‌కి వెళ్లడం%ూ% అక్కడ నచ్చినవి, కావల్సినవి తీసుకోవడం ఇది తొలి తరం కొనుగోలు. ఇక రెండో తరంలో, ఏదన్నా కంపెనీ వినియోగదారుడి దగ్గర ఆర్డర్ తీసుకుని ఒక రెండుమూడు రోజులలో తను కోరిన సరుకులను అందించేవాళ్లు. మొదటి రెండు తరాల్లోనూ వినియోగదారులను ఆకర్షించేందుకు డిస్కౌంట్లు బాగా ఉపయోగపడ్డాయి. డీమార్ట్ దగ్గర నుంచి ఫ్లిప్‌కార్ట్ వరకూ విజయవంతం అయ్యింది ఇక్కడే. ఇక మూడో తరానికి వచ్చేసరికి వేగానిదే ప్రాధాన్యం. ఇందులో దొరికే వస్తువులు, రాయితీలు తక్కువగానే ఉంటాయి కానీ%ూ% ఎంత త్వరగా వస్తుందనేదే ఎంపికను ప్రభావితం చేస్తుంది. అందుకే ఈ క్విక్ కామర్స్ సంస్థలు వచ్చిన మొదట్లో వస్తువును అందించేందుకు 90 నిమిషాలు పడితే దాన్ని రానురానూ పది నిమిషాలకు తగ్గించాల్సి వచ్చింది. ఇంతకీ వీటి ప్రభావం ఏమిటి? పనిలో తీరుతెన్నులెలా ఉన్నాయి? లాభనష్టాల సంగతేంటి? చూద్దాం రండి!

**కిరాణాలకు రణమే!**

'అప్పిచ్చువాడు వైద్యుడు' అన్న పదబంధం సామెతగా బలపడిపోయింది కానీ, అప్పిచ్చువాడు, వైద్యుడు, పారే నది లేని ఊరికి వెళ్లొద్దు అని సుమతీ శతకం. ఇందులో అప్పిచ్చు షావుకారు మరెవరో కాదు.. ఆ ఊరి కిరాణ




కొట్టు యజమానే! కొన్ని వందల ఏళ్లుగా ఊళ్లోని కిరాణా దుకాణాలే, ఇంటి అవసరాలను ఆదుకుంటూ వస్తున్నాయి. ఊహ తెలిసినప్పటి నుంచీ అలవాటయ్యే కిరాణా, కేవలం కొట్టు మాత్రమే కాదు. తర్వాత నెలలో బిల్లు చెల్లించే క్రెడిట్ కార్డు, అవసరంలో అప్పిచ్చి ఆదుకునే ఆప్తమిత్రుడు, ఇంటిల్లిపాదీ మంచిచెడులను పరామర్శించే శ్రేయోభిలాషి. కొవిడ్ సమయంలో పెద్దపెద్ద సూపర్ మార్కెట్లు మూతపడితే ఆదుకున్నది ఆ కిరాణాలే. కానీ, అవే ఇప్పుడు అంపశయ్య మీద ఉన్నాయి. %గూ×జూణఖీ% సంస్థ ప్రకారం గడిచిన సంవత్సరంలో రెండు లక్షల కిరాణా దుకాణాలు మూతపడ్డాయి. వీటిలో దాదాపు సగం పెద్ద నగరాలకు చెందినవే. క్విక్ కామర్స్ అందుబాటులోకి రావడమే ఈ పరిణామానికి కారణం. వినియోగదారులు కిరాణా దుకాణాలకు వెళ్లడాన్ని సగానికి సగం తగ్గించేశారని మరో నివేదిక చెబుతోంది. సాధారణంగా దీపావళికి కొట్లన్నీ కిటికిటలాడిపోతాయి. కానీ ఈసారి మాత్రం చీకట్లు రాజ్యమేలాయి. అదే సమయంలో క్విక్ కామర్స్ సేవలు గతంతో పోలిస్తే ఏకంగా 250 శాతం ఎక్కువ అమ్మకాలను నమోదు చేశాయి.

**ఎదుగుదలకు సాక్ష్యాలు!**

మన దేశంలో వచ్చిన తొలి క్విక్ కామర్స్ సంస్థలలో ఒకటిగా గ్రోఫర్స్‌ని గుర్తిస్తారు. ముందు ఆన్‌లైన్‌లో సరుకులను అందించిన గ్రోఫర్స్, తర్వాత క్విక్ కామర్స్‌గా మారింది. ముందు 90 నిమిషాల్లో డెలివరీ అనే ప్రయోగాన్ని మొదలుపెట్టారు. అదేమంత లాభసాటి కాకపోవడంతో క్రమంగా పది నిమిషాలకు సమయాన్ని తగ్గించారు. అయినా కూడా నష్టాలు తప్పలేదు. ఏటికేడు వస్తున్న నష్టాలు భరించలేక చాలామంది ఉద్యోగులను సైతం తొలగించారు. ఎన్నో ఒడుదొడుకుల మధ్య 'బ్లింకిట్' అంటూ పేరు మార్చి జొమాటోకి అమ్మారు. ఇప్పుడా సంస్థ వేగం పుంజుకుంది. ఫుడ్ డెలివరీ యాప్‌గా స్విగ్గీ గురించి పరిచయం అవసరం లేదు. 2020లో ఇన్‌స్టామార్ట్ పేరుతో క్విక్ కామర్స్ మొదలుపెట్టిందీ సంస్థ. కేవలం రెండు నగరాల్లో మొదలైన ఇన్‌స్టామార్ట్ సేవలు ఇప్పుడు 40కి పైగా నగరాలకు విస్తరించాయి. సరుకుల నుంచి గృహోపకరణాల వరకూ దాదాపు 20 వేల రకాల సామగ్రి అందిస్తున్నది ఇన్‌స్టామార్ట్. వస్తువులను అందించే సమయాన్ని రోజురోజుకూ మెరుగుపరుచుకుంటూ ప్రస్తుతానికి సగటు డెలివరీ సమయాన్ని 13 నిమిషాలకు తగ్గించుకుంది. కొవిడ్ సమయంలో ఇంటి దగ్గరికే సేవలను అందించాల్సిన సందర్భం బలపడింది. దీన్ని ఉపయోగించుకుని 2021లో మొదలైన జెప్టో అనూహ్యమైన వృద్ధిని సొంతం చేసుకుంటున్నది. ఈ ఆగస్టు నాటికి ఈ కంపెనీ విలువ నాలుగు వేల కోట్లకు చేరుకుంది.

**నిరుద్యోగులకు వరమా శాపమా!**

పది నిమిషాల్లో వస్తువును అందించడం వినియోగదారులకు వరమే కావచ్చు. కానీ, దాన్ని అందించేవారి మీద ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ఊహించుకోవచ్చు? పట్టణాల్లో రద్దీ చాలా ఎక్కువ%ూ% దాన్ని తట్టుకుని పది నిమిషాల్లో డెలివరీ చేయడం అంటే ప్రతీసారీ పోరాటమే. పోనీ అందుకు అందే పారితోషికం నగరంలోని జీవనవ్యయానికి సరిపోతుందా అంటే%ూ% పెట్రోలు ఖర్చులు, బండి మీద పెట్టుబడి పోను మిగిలేది అరకొరే! అందుకే క్విక్ కామర్స్ సేవలను కొంతమంది 'టెన్ మినిట్ మర్డర్'గా విమర్శిస్తారు. అటు వినియోగదారుడూ, ఇటు పెట్టుబడిదారుడూ సంతృప్తి పడుతున్న ఈ రంగంలో నష్టపోతున్నది కార్మికులే అన్నది మరికొందరి భావన. 'మన జీవితంలో చాలా వస్తువుల కోసం రెండు నుంచి ఆరు గంటల వరకూ ఎదురుచూడటంలో తప్పులేదు. వాటిని కేవలం పది నిమిషాల్లో అందించే సేవల వల్ల శ్రామికుల మీద తీవ్ర ఒత్తిడి పడుతుంది' అనే ట్వీట్ ఆమధ్య సంచలనంగా మారింది. ఇలా ప్రత్యేకమైన పనివేళలు, వేతనం, సౌకర్యాలు లేకుండా పనిచేసే ఇలాంటి రంగాలలో ఉద్యోగులను 'గిగ్ వర్కర్స్' అంటారు. క్విక్ కామర్స్‌లో ఉండే గిగ్ వర్కర్స్‌కి మరిన్ని సమస్యలు ఉంటాయి. డెలివరీ సమయం ఎక్కువ ఉంటే వారి రేటింగ్ తగ్గుతుంది, ఇక జీతానిది మరో ముఖ్యమైన సమస్య. నలభై వేల వరకూ, యాభై వేల వరకూ సంపాదించవచ్చని ఊరిస్తూ ఉద్యోగాలిచ్చే కంపెనీల్లో అందులో సగం రావడం కూడ గగనంగా మారుతున్నది. న్యూయార్క్ టైమ్స్ లాంటి పత్రికలు సైతం భారతీయ క్విక్ కామర్స్ రంగంలోని కార్మికుల కష్టాల గురించి కథనాలు రాశాయి. కానీ, వాటికి పరిష్కారాలు మాత్రం లభించే పరిస్థితులు లేవు. గిగ్ వర్కర్స్ అసంఘటిత కార్మిక రంగంలోకి వస్తారు



## 79 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ : బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో పుత్తడి ధర రూ.79 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.190 తగ్గిన తులం ధర రూ.78,960కి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.190 తగ్గి రూ.78,650గా నమోదైంది. కానీ వెండి ధరలు పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.350 పెరిగి రూ.93,850 పలికింది. కానీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర స్వల్పంగా రూ.160 పెరిగి రూ.77,780కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.150 అందుకొని రూ.71,300కి చేరింది. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధరలు పెరిగినప్పటికీ రిటైల్‌గా మాత్రం తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,673 డాలర్లు పలుకగా, వెండి 32.19 డాలర్ల వద్ద ఉన్నది.



## రూపాయి.. బెంబేలు

### చారిత్రక కనిష్ఠ స్థాయి 84.86కి విలువ

ముంబై : దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతోపాటు దేశీయ ఈక్విటీలు కుదేలవడంతో కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం ఒకేరోజు 20 పైసలు నష్టపోయి నెల కనిష్ఠ స్థాయిని 84.86ని తాకింది. మునుపెన్నడు లేని స్థాయికి పతనమైనట్లు అయింది. డాలర్‌కు అనూహ్యంగా దిగుమతిదారుల, విదేశీ బ్యాంకుల నుంచి డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.70 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 84.86 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి కరెన్సీ విలువై 20 పైసలు కోల్పోయి 84.86 వద్ద ముగిసింది. గత శుక్రవారం 5 పైసలు పెరిగి 84.66 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 4న చారిత్రక కనిష్ఠ స్థాయి 84.75ని తాకిన విషయం తెలిసిందే. రూపాయి పతనంతో భారత్ దిగుమతులపై అధికంగా చెల్లింపులు జరుపాల్సి ఉంటుంది.




## వాహన ధరలు పెంచిన టాటా, కియా

న్యూఢిల్లీ : వాహన ధరలను మరో రెండు సంస్థలు పెంచాయి. ఇప్పటికే మారుతి, హ్యుందాయ్, మహీంద్రాతోపాటు లగ్జరీ సంస్థలైన మెర్సిడెంజ్ బెంజ్, బీఎండబ్ల్యూ తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచగా..తాజాగా ఇదే జాబితాలోకి టాటా మోటర్స్, కియాలు కూడా చేరాయి. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. టాటా మోటర్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను జనవరి నుంచి అమలులోకి వచ్చేలా 3 శాతం వరకు సవరిస్తుండగా, అదే కియో వాహనధరలు 2 శాతం వరకు పెంచుతున్నట్టు తెలిపింది.




## 12 నుంచి ప్యాకాన్-2024 సదస్సు

హైదరాబాద్: ప్యాకేజింగ్ రంగం పురోగతి, భవిష్యత్తు అవసరాలపై ప్యాకాన్-2024 పేరుతో ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించబోతున్నట్లు సీఐఐ తెలంగాణ ప్రకటించింది. రేపటి ప్రపంచ మార్కెట్ సవాళ్ల కోసం నేటి ఆవిష్కరణలు' అనే థీమ్‌తో ఏర్పాటుచేస్తున్న ఈ సదస్సుకు ఆ రంగానికి చెందిన నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు.. పెరుగుతున్న మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయాల్సిన నూతన ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. సుమారు 200మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో ప్యాకేజింగ్ రంగానికి చెందిన ఉత్పత్తులను కూడా ప్రదర్శించనున్నట్లు చెప్పారు.




## రోజూ 10 లక్షల స్పామర్స్

### గుర్తించిన ఎయిర్‌టెల్ ఏఐ నెట్‌వర్క్

న్యూఢిల్లీ : తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్.. రోజూ 10 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇక గత రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల ఎస్ఎంఎస్‌లను కూడా గుర్తించినట్టు ఈ దేశీయ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌పై వచ్చిన కాల్స్‌లో 6 శాతం, ఎస్ఎంఎస్‌ల్లో 2 శాతం స్పామర్లు చేసినవేనని తేలింది. స్పామ్ కాల్స్ చేసింది, అందుకున్నది రెండింటిలోనూ ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఢిల్లీ తర్వాత ఏపీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ యూజర్లు స్పామ్ కాల్స్‌ను అధికంగా అందుకున్నారు. ఢిల్లీ తర్వాత ముంబై, కర్నాటకల నుంచి స్పామ్ కాల్స్ ఎక్కువగా వెళ్లాయి. అలాగే ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచే స్పామ్ కాల్స్ అధికంగా వస్తున్నట్టు కనిపెట్టారు. ఎస్ఎంఎస్‌ల విషయానికొస్తే.. గుజరాత్, కోల్‌కతా, యూపీల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముంబై, చెన్నై, గుజరాత్ వాసులే లక్ష్యంగా ఇవి వెళ్లాయి. పురుష వినియోగదారులే లక్ష్యంగా 76 శాతం స్పామ్ కాల్స్ వచ్చాయి. ఈ ఏఐ పవర్డ్ సొల్యూషన్‌ను రెండున్నర నెలల క్రితమే ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. కాగా, దీంతో భారతీయ తొలి స్పామ్ ఫైటింగ్ నెట్‌వర్క్‌గా భారతీ ఎయిర్‌టెల్ నిలిచింది. మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, సందేశాలకు అడ్డుకట్ట వేయాలని టెలికం సంస్థలను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశించినది తెలిసిందే.

## ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆర్బీఐకి ఈయన 26వ గవర్నర్ కానున్నారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగుస్తున్నది. ఈ క్రమంలోనే ఆయన స్థానంలోకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ మల్హోత్రాను మోదీ సర్కారు తీసుకొచ్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ లైన్‌క్లియర్ చేసింది. బుధవారం (డిసెంబర్ 11) నుంచి మూడేండ్లపాటు ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తిచేసిన సంజయ్ మల్హోత్రా.. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని సైతం పొందారు. 33 ఏండ్ల తన కెరియర్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ శాఖల్లో మరెన్నో బాధ్యతల్ని మల్హోత్రా నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విద్యుత్తు, ఆర్థిక, పన్నులు, ఐటీ, గనులు తదితర రంగాల్లో సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తుండగా, అంతకుముందు ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించారు.

**నేడు దాస్ పదవీ విరమణ**

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. రిజర్వ్ బ్యాంక్ 25వ గవర్నర్‌గా 6 ఏండ్లు పనిచేసిన ఆయన.. అప్పటి గవర్నర్ ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో 2018 డిసెంబర్ 12న ఈ పదవిలోకి వచ్చారు. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. కేంద్ర ఆర్థిక శాఖలోని వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే 8 కేంద్ర బడ్జెట్లలో భాగస్వాములయ్యారు. ఇక అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్‌లో రెండుసార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా దాస్ అగ్రస్థానాల్లో నిలవడం విశేషం.

**కేంద్రానికి దన్నుగా..**

గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ వైఖరితో ఆర్బీఐ-కేంద్రం మధ్య దూరం పెరిగిన వేళ దాస్‌ను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిజానికి అప్పటికే దాస్ రిటైరైపోయారు. ఈ క్రమంలో తనపై కేంద్ర పెద్దలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూపోయిన దాస్.. ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను కేంద్ర ఖజానాకు తరలించడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంతేగాక ఏటా కేంద్రానికి భారీగా డివిడెండ్లనూ అందించారు. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఏకంగా మునుపెన్నడూలేనివిధంగా రూ. 2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను అప్పజెప్పారు. నిజానికి వీటిని వ్యతిరేకించే నాడు ఆర్బీఐ గవర్నర్ పదవికి పటేల్ రాజీనామా చేయడం గమనార్హం. ఇక కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించడం, ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అంతే స్థాయిలో పెంచడం, వృద్ధి-ధరల మధ్య సమన్వయం కోసం సుదీర్ఘకాలం వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచడం దాస్‌కే చెల్లింది. 2016లో పాత పెద్ద నోట్ల రద్దు అంశంలోనూ నాటి ఆర్బీఐ గవర్నర్ పటేల్ కంటే దాసే కీలకపాత్ర పోషించడం విశేషం.



## హొటల్ గదుల్లో కూర్చోవడం కాదు.. రోహిత్, కోహ్లీలపై గవాస్కర్ ఘాటు వ్యాఖ్యలు



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ రెండో టెస్టు లో ఓడి సిరీస్‌ను 1-1 తో సమం అయ్యేలా చేసిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు లెజెండరీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఘాటైన సందేశం ఇచ్చారు. హొటల్ గదుల్లో కూర్చుని సమయాన్ని వృథా చేయకుండా బయటికొచ్చి ప్రాక్టీస్ చేయాలని సీరియస్ కామెంట్ చేశారు. ఇకనైనా ఈ సిరీస్‌ను మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా భావించి సీరియస్‌గా ఆడాలని హితవు పలికారు. మూడు రోజులకే ముగిసిన రెండో టెస్టులో భారత్ ఏ కోశాన కూడా ఆస్ట్రేలియాకు సరైన పోటీ ఇవ్వలేకపోయింది. మ్యాచ్ ఆద్యంతం ఆస్ట్రేలియాదే పైచేయిగా సాగింది. దాంతో మూడో రోజు రెండో సెషన్‌లోనే మ్యాచ్ ముగిసింది. భారత్ నిర్దేశించిన 19 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ వికెట్ నష్టపోకుండా ఛేధించింది. భారత్ 10 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ నేపథ్యంలో సీనియర్ క్రికెటర్‌లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలపై గవాస్కర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఇకనైనా ఈ సిరీస్‌ను మూడు టెస్టుల సిరీస్‌గా భావించి సీరియస్‌గా ఆడండి. ఇది ఐదు టెస్టుల సిరీస్ అనే సంగతి మర్చిపోండి. నేను టీమిండియాకు చెప్పదల్చుకున్నది ఏమిటంటే వచ్చే రెండు రోజులైనా బాగా ప్రాక్టీస్ చేయండి. ఈ రెండు రోజుల ప్రాక్టీస్ చాలా ముఖ్యం. ఈ రెండు రోజులు హొటల్ రూమ్‌లో కూర్చోవడమో, లేదంటే ఎటైనా వెళ్లడమో చేయకండి. ఎందుకంటే మీరిక్కడికి క్రికెట్ ఆడటానికి వచ్చారు' అని గవాస్కర్ తన సందేశంలో పేర్కొన్నారు. 'మీరు రోజంతా ప్రాక్టీస్ చేయాల్సిన అవసరం లేదు. మీరు ఉదయంగానీ, మధ్యాహ్నం గానీ మీకు వీలైన ఒక సెషన్‌లో ప్రాక్టీస్ చేయవచ్చు. అంతేగానీ సమయం వృథా చేయకండి. ఐదు రోజులు మ్యాచ్ ఆడాలంటే ఆమాత్రం ప్రాక్టీస్ ఉండాలి' అని గవాస్కర్ సూచించారు. అంతేగాక భారత ఆటగాళ్ల పేలవమైన ఆటతీరువల్లే రెండో టెస్టులో ఓటమి ఎదురైందని ఆయన వ్యాఖ్యానించారు. బ్యాటర్‌లుగానీ, బౌలర్‌లుగానీ ఏమాత్రం మంచి ప్రదర్శన ఇవ్వలేదని పెదవి విరిచారు. ఇప్పటికైనా ఆటగాళ్లు రిథమ్ అందుకోవాలని గవాస్కర్ అన్నారు. అందుకు రెండు రోజుల సమయం అదనంగా దొరికిందని చెప్పారు. రిథమ్ కోల్పోవడంవల్లే బ్యాటర్‌లు పరుగులు రాబట్టడంలో, బౌలర్‌లు వికెట్లు తీయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కెప్టెన్, కోచ్ కూడా ఆటగాళ్లకు ప్రాక్టీస్ విషయంలో ఆప్షన్‌లు ఇవ్వడం మానుకోవాలని సూచించారు. అందరూ ప్రాక్టీస్ చేయాల్సిందే అన్నారు.

# హైదరాబాదీ బౌలర్‌కు షాక్ ఇచ్చిన ఐసీసీ.. మ్యాచ్ ఫీజులో 20శాతం కోత.. హెడ్‌కు మందలింపు..!




టీమిండియా బౌలర్ మహ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి షాక్ ఇచ్చింది. కీలక చర్యలు తీసుకున్నది. అడిలైడ్ వేదికగా జరిగిన టెస్టులో మైదానంలోనే ఆసిస్ బ్యాటర్‌తో గొడవ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ సిరాజ్‌కు జరిమానా విధించగా.. హెడ్‌ను మందలించింది. సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 20శాతం కోత విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు సిరాజ్, ట్రావిస్ హెడ్ ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. అడిలైడ్ టెస్ట్‌లో ట్రావిస్ హెడ్ అవుట్ అయ్యాక సిరాజ్ దూకుడుగా వ్యవహరించాడని.. ఇద్దరి మధ్య కొద్ది సెకన్ల పాటు వాగ్వాదం జరిగింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని సెక్షన్ 2.5ని ఉల్లంఘించినందుకు సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 20శాతం కోత విధించినట్లు ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. సెక్షన్ 2.13 ఉల్లంఘినందుకు ట్రావిస్ హెడ్‌ను మందలించింది. అయితే, బోర్డర్ గవాస్కర్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా రెండో టెస్ట్ మ్యాచ్ జరిగింది. 310 పరుగుల స్కోరు వద్ద సిరాజ్ వేసిన యార్క్‌కు ట్రావిస్ హెడ్ బౌల్డ్ అయ్యాడు. 141 బంతుల్లో 140 పరుగులు చేసిన హెడ్‌ను బౌల్డ్ చేశాక సిరాజ్ దూకుడుగా వ్యవహరించారు. అయితే, హెడ్ సైతం పెవిలియన్‌కి వెళ్లే సమయంలో సిరాజ్‌ను ఏదో అన్నాడు. దానికి సిరాజ్ స్పందిస్తూ మొదట ఇక్కడి నుంచి వెళ్లు అన్నట్లుగా చెప్పడంతో వాతావరణం వేడెక్కింది. అయితే, తాను బాగా బౌలింగ్ చేశావని సిరాజ్‌ను మెచ్చుకున్నానని.. దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నాడని హెడ్ మ్యాచ్ అనంతరం తెలిపాడు. అయితే, దాన్ని సిరాజ్ ఖండించారు. హెడ్ చెప్పినవన్నీ అబద్ధాలేనని కొట్టిపడేశాడు. ఈ గొడవపై ఇద్దరు కెప్టెన్లు సైతం స్పందించేందుకు ఇష్టపడలేదు. గొడవ గురించి హెడ్ చూసుకుంటాడని.. అతను పిల్లాడు కాదని ఆసిస్ కెప్టెన్ కమిన్స్ పేర్కొనగా.. దూకుడుగా ఉండడం తప్పులేదని.. సిరాజ్‌కు మద్దతు ఇస్తున్నట్లు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ స్పష్టం చేశాడు.



## గుకేష్కు ఎదురుదెబ్బ

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప ఫైనల్ మరో రెండు రౌండ్లలో ముగుస్తుందనగా భారత యువ జీఎం దొమ్మరాజు గుకేష్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ముగిసిన పన్నెండో రౌండ్లో గుకేషపై వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా) 39 ఎత్తుల్లో గెలుపొందాడు. ఈ మెగా ఫైనల్లో డింగ్ తెల్ల పావులతో విజయం సాధించడం ఇదే తొలిసారి. అంతేకాక 14 రౌండ్ల ఈ సుదీర్ఘ ఫైనల్లో 11 గేమ్‌ల తర్వాత డింగ్ నెగ్గడం విశేషం. ఈ ఫైనల్ మొత్తం పరిశీలిస్తే గుకేష్ పేలవంగా ఆడిన రౌండ్ ఇదే కావడంతో అందుకు తగిన మూల్యం చెల్లించుకున్నాడు. డింగ్ తాజా విజయంతో ఇరువురి స్కోర్లు 6-6తో సమమయ్యాయి. తదుపరి రెండు రౌండ్లలో ఎవరైతే 1.5 పాయింట్లు సాధిస్తారో వారే విజేతగా నిలుస్తారు.

## బ్రాండింగ్‌లో కింగ్..ధోనీ





నాలుగేళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రేజ్ ఇసుమంతైనా తగ్గలేదు. కార్పొరేట్ ప్రపంచం అతడిని తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉపయోగించుకునేందుకు ఇప్పటికీ క్యూ కడుతోంది. ధోనీ ప్రస్తుతం 42 కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని టాప్‌లో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయంలో అతను బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్ (41 కంపెనీలు), షారుక్ ఖాన్ (34)లను కూడా దాటేశాడు. చెన్నై తరఫున ఐపీఎల్‌లో మాత్రమే ఆడుతున్న 43 ఏళ్ల ధోనీ.. మొత్తం ఆస్తి రూ.1,040 కోట్లుగా సమాచారం.



## రష్మిక మందన్న గర్ల్‌ఫ్రెండ్ మూవీ టీజర్.. వాయిస్ ఓవర్ ఇచ్చిన స్టార్ హీరో


దీక్షిత్ శెట్టి, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో రష్మిక మందన్న పాత్రకు సంబంధించిన టీజర్ తాజాగా విడుదలైంది. విజయ్ దేవరకొండ సోషల్ మీడియాలో ఈ మూవీ టీజర్‌ను షేర్ చేశాడు. "ఈ టీజర్‌లోని ప్రతి సన్నివేశం నాకు బాగా నచ్చింది. ఈ సినిమాను చూడడానికి నేను సంతోషిస్తున్నాను. రష్మిక మనలాంటి చాలా మంది నటులకు లక్కీ హీరోయిన్. పెద్ద స్టార్ నటిగా ఎదిగినా కూడా.. నాకు 8 ఏళ్ల క్రితం పరిచయమైన అమ్మాయిలానే ఉంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను' అని విజయ్ దేవరకొండ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చాడు. 'ది గర్ల్‌ఫ్రెండ్' టీజర్ అందరినీ ఆకర్షిస్తోంది. కాగా అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా నటించిన 'పుష్ప 2' సినిమా భారీ రికార్డు సృష్టించింది. 4 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా 820 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసింది.

## పడవ ప్రయాణంలో విహరిస్తూ... పక్షులకు ఆహారం పెడుతున్న శ్రీలీల



## మూవీతో జక్కన్న మరో ప్రయత్నం..!

బాహుబలితో ఇండియన్ సినిమా ముఖ చిత్రాన్నే మార్చేసిన రాజమౌళి.. ఆ తరువాత ట్రిపులార్ తో మన సినిమాను గ్లోబల్ రేంజ్ కు తీసుకెళ్లారు. ఏళ్ల దశాబ్దాలుగా ఇండియన్ సినిమాను ఊరిస్తున్న ఆస్కార్ అవార్డును సాధించి తెలుగు సినిమా ఖ్యాతీని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఈ సినిమాతో ఎంత లాంగ్ జర్నీ, ఇన్ని గ్రేట్ మెమొరీస్ ఉన్నాయి కాబట్టే జక్కన్నకు కూడా ఈ మూవీ ఎంతో స్పెషల్. బాహుబలి విషయంలో చేయని చాలా ప్రయత్నాలు ట్రిపులార్ కోసం చేస్తున్నారు రాజమౌళి. సినిమా రిలీజై ఇంత కాలం అవుతున్నా ఇప్పటికీ ఆ కంటెంట్ తో ట్రావెల్ చేస్తూనే ఉన్నారు జక్కన్న. ఓ వైపు గ్లోబల్ రేంజ్ లో మహేష్ తో చేస్తున్న మూవీకి సంబంధించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తునే ట్రిపులార్ కోసం కూడా వర్క్ చేస్తున్నారు జక్కన్న. తాజాగా ఈ సినిమా మేకింగ్ తో పాటు బ్యాక్ గ్రౌండ్ వర్క్ కు సంబంధించి ఓ డాక్యుమెంటరీని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.






## అంతకుమించితే ప్రమాదం!



వ్యాయామం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, పరిమితికి మించి శరీరాన్ని ఇబ్బందిపెడుతూ కష్టాలను కొనితెచ్చుకోవద్దని సలహా ఇచ్చింది కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈ భామ రెండు నెలల క్రితం జిమ్‌లో గాయపడిన విషయం తెలిసింది. 80 కిలోల బరువును ఎత్తే క్రమంలో ఆమె వెన్నెముకపై అధికభారం పడటంతో అనారోగ్యానికి గురైంది. ఇటీవల కోలుకున్న ఈ భామ తన ఆరోగ్యం గురించి అప్‌డేట్ అందించింది. ఆరోగ్యపరంగా శరీరం అందించే సంకేతాలకు జాగ్రత్తగా గమనించాలని, అందుకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించింది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020